సామాన్యుల గొంతుక - సకల జనుల వేదిక

# జనగణమన

మంగళవారం 25-08-2026 హైదరాబాద్ సంపుటి : 01
Circulated in Telangana & Andhra Pradesh సంచిక : 117

దినపత్రిక

వెల : రూ.5.00 పేజీలు : 08
www.janaganamanadaily.com




## గుజరాత్ ఆధిపత్యాన్ని సహించేది లేదు..

### కేంద్రంపై రెచ్చిపోయిన సీఎం రేవంత్ రెడ్డి




**జనగణమన బ్యూరో : హైదరాబాద్:**

తన విదేశీ పర్యటనపై అన్ని వివరాలు కేంద్ర ప్రభుత్వానికి తెలియజేశామని ఈ మేరకు అప్లికేషన్ పెట్టుకున్నామని అయినా కూడా యూకే పర్యటనకు అనుమతి ఇచ్చి, అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి తిరస్కరించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నా పర్యటనకు సంబంధించిన పూర్తి సమాచారం కేంద్రానికి ముందే ఇచ్చామని, విద్య, క్రీడలు, పెట్టుబడుల కోసమే అమెరికా వెళ్తున్నామని చెప్పామని అయినా కేంద్ర ప్రభుత్వం రాజకీయ కారణాలతో నా అమెరికా పర్యటనకు అనుమతి తిరస్కరించిందని మండిపడ్డారు. అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో టూర్ రద్దు అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో యూకే పర్యటన ముగించుకుని సోమవారం ఉదయం హైదరాబాద్ చేరుకున్న ఆయన తెలంగాణ సచివాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నామని విదేశాంగశాఖ బదులిచ్చిందని.. కేంద్రంలో ఉన్న కొందరు బీజేపీ నేతలు కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారని అన్నారు. బీజేపీ నేతలు విచక్షణ కోల్పోయి అవస్తవాలను ప్రచారం చేశారని సీఎం పర్యటన దాపరికంగా ఉన్నట్లు విదేశాంగశాఖ మాట్లాడిందన్నారు. యూకే, అమెరికాకు ఒకే విధానంతో వెళ్తున్నామని చెప్పాం. అలాంటప్పుడు యూకే పర్యటకు అనుమతి ఇచ్చి అమెరికాకు ఎందుకు నిరాకరించారో ప్రధాని నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

(మిగతా 3 లో..)

### మంత్రి కొండా సురేఖకు

## సీఎం రేవంత్ రెడ్డి బిగ్ షాక్

**జనగణమన బ్యూరో :హైదరాబాద్:**

తెలంగాణలో పొలిటికల్ హీట్ మరింత పెరిగింది. పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు రాష్ట్ర ప్రభుత్వం ఊహించని షాక్ ఇచ్చింది. ఆమె శాఖకు సంబంధించి ఇటీవల చేపట్టిన అధికారుల డిప్యూటేషన్లను ప్రభుత్వం సడన్‌గా రద్దు చేసింది. సంబంధిత శాఖ మంత్రికి ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఈ నిర్ణయం తీసుకోవడం సచివాలయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గతంలో అటవీ శాఖలో పలువురు అధికారులను వివిధ స్థానాలకు డిప్యూటేషన్‌పై పంపించారు. అయితే ముఖ్యమంత్రి కార్యాలయం జోక్యంతో ఈ డిప్యూటేషన్లు అన్నింటినీ ఉన్నపళంగా రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సాధారణంగా మంత్రి ఆమోదం లేదా వారి దృష్టికి తీసుకెళ్లాకే నిర్ణయాలు జరుగుతుంటాయి. కానీ, సురేఖకు చెప్పకుండానే శాఖలో ఈ మార్పులు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

### సురేఖ వివాదంపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు..

మరోవైపు, మీడియా సమావేశంలో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై స్పందించారు.



కొండా సురేఖ వ్యవహారాన్ని కాంగ్రెస్ పార్టీ చూసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ అంశం ప్రస్తుతం పార్టీ క్రమశిక్షణ కమిటీ పరిధిలో ఉందని వెల్లడించారు. పార్టీ అంతర్గత విషయాలపై తాను బహిరంగంగా మాట్లాడనని తేల్చిచెప్పిన సీఎం.. అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా నాయకులైనా, కార్యకర్తలైనా దానికి కట్టుబడి ఉండాల్సిందేనని తేల్చిచెప్పారు. మంత్రి శాఖలోని నిర్ణయాల్లో మార్పులు, మరోవైపు సీఎం చేసిన కామెంట్లు చూస్తుంటే కాంగ్రెస్ హైకమాండ్, రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

## సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు



**జనగణమన బ్యూరో : హైదరాబాద్:**

తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ, సామాజిక పరిణామాల నేపథ్యంలో ఈ సమావేశాలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఉభయ సభలను ఎన్ని రోజుల పాటు నిర్వహించాలనే అంశంపై తొలి రోజు సమావేశం అనంతరం స్పీకర్ నేతృత్వంలో జరిగే శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ భేటీలో (మిగతా 3 లో..)

## పత్రిక అధినేతకు బెంజ్ కారు ఎట్లొచ్చింది?..

### రెచ్చిపోయిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




**జనగణమన బ్యూరో :హైదరాబాద్:**

రాష్ట్రంలో 22ఏ అంశంలో ప్రతిపక్షాలు అబద్దాలతో ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. సామాన్యులను అడ్డం పెట్టుకొని వారి స్వప్రయోజనాల కోసం ప్రయత్నిస్తున్నారన్నారు. నాలుగు వారాల నుంచి రివ్యూ చేస్తున్నానన్నారు. రెగ్యులరైజ్ చేసిన, వివిధ ఆర్డర్ల ద్వారా హక్కులు పొందిన వాటిని రెక్టిఫై చేశామన్నారు. సోమ వారం సచివాలయంలో ఏర్పా టు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పీవోబీలో ఉన్నప్పటికీ ఆర్డర్ కాపీలు ఉంటే రిజిస్ట్రేషన్లు చేస్తున్నామని, 300 స్లాట్లల్లో కేవలం 12, 13 మాత్రమే భూ దాన్, దేవాదాయ, వక్ఫ్‌ల్యాండ్ పేరిట నిలిపి వేశామన్నారు. టోల్ ఫ్రీ నంబర్ కి 18న 2, 19న 168, 20న 200, 21న 369, 22న 309 వంతున మొత్తం 1162 కాల్స్ మాత్రమే వచ్చాయ న్నారు. అందులో అగ్రికల్చర్ కి సంబంధించినవి 612, నాన్ అగ్రికల్చర్ కి సంబంధి చినవి 542 ఉన్నాయన్నారు. వీటిలో ఓవర్ ల్యాప్ కాల్స్ తొలగించగా మొత్తం 980 కాల్స్ ఉన్నాయి. వాటిలో వ్యవ సాయం 547, వ్యవసాయేతర కాల్స్ 433గా రికార్డు అయ్యాయి.

(మిగతా 3 లో..)

## హైకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి స్వల్ప ఊరట



**జనగణమన బ్యూరో : హైదరాబాద్:**

తెలంగాణ ప్రభుత్వానికి రాష్ట్ర హైకోర్టులో కీలక ఊరట లభించింది. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలవుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ యువతులకు అందిస్తున్న అదనపు ఆర్థికసాయాన్ని కొనసాగించుకునేందుకు హైకోర్టు పచ్చజెండా ఊపింది. (మిగతా .3 లో..)


## జాబ్ నోటిఫికేషన్లు నిల్..

### లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం ఫుల్

### బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు

**జనగణమన బ్యూరో: హైదరాబాద్:**

తెలంగాణ ప్రభుత్వం కొత్తగా 121 రకాల మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్ ఇవ్వడంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వకుండా.. మద్యం బ్రాండ్లకు మాత్రం నోటిఫికేషన్లు జారీ చేస్తున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం ఫుల్' అంటూ హరీశ్ రావు ఎద్దేవా చేశారు. యువత భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై దృష్టి పెట్టకుండా మద్యం వ్యాపారంపై ఎందుకు అంత ఆసక్తి చూపుతోందని ప్రశ్నించారు.రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హరీశ్ రావు పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం లిక్కర్ అమ్మకాలపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రభుత్వ తీరుపై విమర్శలు చేశారు.



### 121 కొత్త మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్

తెలంగాణలో కొత్తగా 121 రకాల మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రానున్నట్లు ఆదివారం ప్రకటన వెలువడింది. సుమారు 18 కంపెనీలకు చెందిన మద్యం సరఫరాదారులు ఈ బ్రాండ్లను రాష్ట్రంలో ప్రవేశపెట్టనున్నట్లు ఎక్సైజ్ శాఖ తెలిపింది.

## స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు ప్రజల బ్రెయిన్ వాష్..

### రేవంత్ సర్కార్‌పై కవిత విమర్శలు



**జనగణమన బ్యూరో : హైదరాబాద్:**

రాష్ట్రంలో విద్యుత్ కనెక్షన్లకు దశలవారీగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఈ నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల అమలకు ప్రభుత్వం ప్రజల బ్రెయిన్ వాష్ చేసే కార్యక్రమం చేస్తోందని ఇందులో భాగంగానే విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల మాటలు, ఇటీవల నెక్లెస్ రోడ్డులో స్మార్ట్ మీటర్ల ఉపయోగం పేరుతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఓ వీడియోను రిలీజ్ చేసిన కవిత.. తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల పక్షాన కాకుండా పెద్దల పక్షాన ఉందని పదే పదే నిరూపించు కుంటోందని దుయ్యబట్టారు.(మిగతా 3 లో..)

## భూసేకరణ వేగవంతం..

### రూ.250 కోట్ల నిధులు మంజూరు: మంత్రి పొన్నం ప్రభాకర్




**జనగణమన బ్యూరో:హుస్నాబాద్:**

గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తన ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చిగురుమామిడి మండలం కొండాపూర్‌లో సోమవారం 'పల్లె పల్లెకు పొన్నం అన్న- పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి.. గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని మంత్రి తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.250 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. మూడు జిల్లాల కలెక్టర్లు భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రక్రియను వేగవంతం చేస్తున్నారని చెప్పారు. కాల్వల నిర్మాణానికి రైతులు సహకరించాలని కోరారు. భూములు సేకరించిన వెంటనే అర్హులైన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. ఆయిల్‌ఫామ్ సాగుతో అధిక లాభాలు పొందే అవకాశం ఉందని, రైతులు ఈ పంట సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

(మిగతా 3 లో..)

# అర్హులైన ప్రతి గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చర్యలు చేపడతాం

### ఎస్ డి సి ట్రైబల్ వెల్ఫేర్ ఆనంద్ కుమార్

భద్రాచలం ఆగస్టు 24జనగణమన ప్రతినిధి,. సుదూర గిరిజన గ్రామాలు నుండి గిరిజన దర్బార్ కు వివిధ సంక్షేమ పథకాల కోసం అర్జీలు పెట్టుకునే గిరిజనులకు అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా సంబంధిత ఐటీడీఏ యూనిట్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్ డి సి ట్రైబల్ వెల్ఫేర్ ఆనంద్ కుమార్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో ఐటీడీఏ పీవో బి రాహుల్, ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్ అధికారిక పనులపై వెళ్లి అందుబాటులో లేనందున వివిధ ఆదివాసి గిరిజన గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల నుండి ఐటీడీఏ యూనిట్ అధికారుల సమక్షంలో ఆయన అర్జీలు స్వీకరించి, సంబంధిత అధికారులకు పంపుతూ అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈరోజు నిర్వహించిన గిరిజన దర్బార్లో ఎక్కువ శాతం అర్జీలు సోలార్ ద్వారా తమ పొలాలలో బోరు బావులు తవ్వించుట కొరకు, రాజీవ్ యువ వికాసం ద్వారా రుణాలు విప్పించుట కొరకు,



పోడు భూముల సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, గిరిజన గ్రామాలలో రోడ్డు సౌకర్యం కొరకు ,స్వయం ఉపాధి ద్వారా జీవనాధారం పెంపొందించుకోవడానికి ఆర్థిక సహాయం కొరకు, యల్ టి ఆర్ భూ సమస్యలు, గిరిజన గ్రామాలలో కరెంటు సౌకర్యం కొరకు, ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో చేరడానికి శిక్షణలు ఇప్పించుట కొరకు, దీర్ఘకాలిక రోగాలకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం కొరకు, పై చదువులు చదవడానికి ఆర్థిక సహాయం కొరకు, పంట పొలాలకు నీరు అందించడానికి కరెంటు, బోరు మంజూరీ కొరకు, పోడు భూములకు పట్టాలు ఇప్పించుట ఆన్లైన్లో పొందుపరచుట కొరకు, రైతుబంధు రుణం ఇప్పించుట కొరకు, కిరాణా షాప్, ఫ్యాన్సీ స్టోర్ రుణాల కొరకు, మరియు ఇతర ఆర్థిక ప్రయోజనాల కొరకు గిరిజనులు అర్జీలు సమర్పించారనీ ఆయన తెలుపుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికి విడతల వారీగా సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రాంబాబు, ఆర్ సి ఓ గురుకులం అరుణకుమారి, ఏ డి ఎం హెచ్ ఓ సైదులు, ఉద్యానవనాధికారి ఉదయ్ కుమార్, హేచ్ ఈ ఓ లింగ నాయక్, జేడీఎం హరికృష్ణ, మేనేజర్ ఆదినారాయణ వివిధ విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి... జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

ఖమ్మం, ఆగస్టు– 24 జనగణమన ప్రతినిధి అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా, కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని 5 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు కలిపి సుమారు 1.75 లక్షల నోటీసులు జారీ చేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే 75 వేల నోటీసులు జనరేట్ చేసినట్లు వివరించారు. అనామలీస్ క్రింద సుమారు 80 వేల మంది ఓటర్ల పేర్లలో వ్యత్యాసాలు ఉన్నట్లు తెలిపారు.అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు జారీ చేసి, అవసరమైన ఓటర్లను విచారణకు పిలిచేలా పకడ్బందీ ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. నోటీసులు జారీ చేసే సమయంలోనే సంబంధిత ఓటర్లు విచారణకు హాజరయ్యే సమయంలో సమర్పించాల్సిన అవసరమైన పత్రాలు, ఆధారాలపై అవగాహన కల్పిస్తున్నామని, ఎస్ఐఆర్ ప్రక్రియపై మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు.వీడియో సమావేశం అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నోటీసులో విచారణ తేదీ, విచారణ జరిగే ప్రదేశం, సమయాన్ని స్పష్టంగా పేర్కొనాలని, నోటీసు జారీ చేసిన తేదీకి, విచారణ తేదీకి మధ్య కనీసం 7 రోజుల వ్యవధి ఉండేలా చూడాలని తెలిపారు. నోటీసులు అందజేసిన వివరాలను బీఎల్ఓ యాప్లో ఫొటోతో సహా నమోదు చేయాలని, విచారణకు సంబంధించిన వివరాలతో పాటు ఓటర్లు సమర్పించిన ఆధారాలను కూడా యాప్లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ. రాజు, డీటీ అన్సారీ, ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# ప్రజావాణి అర్జీలపై తక్షణ చర్యలు తీసుకోవాలి

### 75 వినతులు స్వీకరించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

మేడ్చల్ మల్కాజిగిరి, కలెక్టరేట్ ఆగస్టు 24 జనగణమన ప్రతినిధి ప్రజల నుంచి అందే సమస్యలను సత్వరమే పరిష్కరించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 75 దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) మాలతి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# పాత రెడ్డిపాలెంలో రేషన్ సమస్యలు పరిష్కరించాలి : సర్పంచ్ నాగకుమారి

పినపాక, ఆగష్టు 24, జనగణమన ప్రతినిధి , పినపాక మండలంలోని పాత రెడ్డిపాలెం గ్రామానికి ప్రత్యేకంగా రేషన్ షాప్ కేటాయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ సమస్యపై సర్పంచ్ సాగబోయిన నాగకుమారి, ఉప సర్పంచ్ సానుకొమ్మ శ్రీనివాసరెడ్డి పినపాక తహసీల్దార్కు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందించిన తర్వాత ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పాత రెడ్డిపాలెంకు రేషన్ షాప్ మంజూరు చేయాలని వారు కోరారు. గ్రామంలో రేషన్ షాప్ లేకపోవడంతో ప్రభుత్వం అందించే బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు పొందేందుకు సమీపంలోని ఇతర గ్రామాలకు వెళ్లాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో వృద్ధులు, మహిళలు, కూలీలు అధికంగా ఉండటంతో రేషన్ సరుకుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లడం ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, పాత రెడ్డిపాలెం గ్రామానికి ప్రత్యేక రేషన్ షాప్ మంజూరు చేయాలని సర్పంచ్, ఉప సర్పంచ్ వినతి పత్రం ద్వారా సంబంధిత అధికారులను కోరుతున్నారు. ఈ సమస్యను అధికారులు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.



# చిల్లర రాజకీయాలు మానుకోండి.. రేగా కాంతారావు ఘాటు వ్యాఖ్యలు

పినపాక. ఆగస్టు 24, జనగణమన ప్రతినిధి..చిల్లర రాజకీయాలతో, తప్పుడు కేసులతో భయభ్రాంతులకు గురి చేస్తే భయపడే వ్యక్తిని కానని పినపాక నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో బి ఆర్ ఎస్ కార్యకర్తల ఆధ్వర్యంలో కరకగూడెం మండలం, గొల్లగూడెం కొత్తగూడెం గ్రామం నుండి ర్యాలీగా బయలుదేరి ప్రధాన రహదారిపై ప్రతి గ్రామంలో వేచి ఉన్న కార్యకర్తలకు అభివాదాన్ని ,విజయ సంకేతాన్ని చూపిస్తూ భారీ ర్యాలీగా బిఆర్ఎస్ కార్యకర్తల విజయ నినాదాలతో బయ్యారం క్రాస్ రోడ్ చేరుకున్న అనంతరం జనసంద్రంగా మారిన బి ఆర్ ఎస్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ రాజకీయంగా ఎదుర్కొనే శక్తి లేక తప్పుడు మహిళతో అక్రమ కేసులు పెట్టించి అరెస్టు చేయాలని, జైలుకు పంపించి వ్యక్తిత్వ హననానికి గురిచేయాలని చూశారన్నారు. బి ఆర్ ఎస్ కార్యకర్తలను బెదిరించాలనే పైశాచిక బుద్ధితో ప్రయత్నాలు చేశారని, కానీ న్యాయస్థానం మీద నమ్మకంతో తాను చేసిన న్యాయపోరాటంలో గెలవడమే కాకుండా ఎఫ్ఐఆర్ నమోదైన కొన్ని గంటల్లోనే తప్పుడు కేసుగా న్యాయస్థానం ద్వారా విచారణ చేయించి రుజువు చేశామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి గుడ్డలు ఊడదీసి కొట్టే రోజులు త్వరలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు తీసుకురానున్నారని , 2028 – 2029 లో జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కకుండా తెలంగాణ ప్రజలు చేయబోతున్నారని తెలిపారు. బి ఆర్ ఎస్ కార్యకర్తలు సంయమనంతో ఉండాలని, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వార్తలు పెట్టవద్దని కార్యకర్తలకు సూచించారు. ఈ ర్యాలీలో బిఆర్ఎస్ ,కార్యకర్తలు ,నాయకులు ,రేగా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు.



# షాదిఖానా నూతన చైర్మన్ గా యాకూబ్ ఆలీ బాధ్యతలు స్వీకరణ.

కారేపల్లి ఆగస్టు 24 జనగణమన ప్రతినిధి .రాష్ట్ర ప్రభుత్వం, వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆదేశానుసారం నూతన షాదిఖానా కమిటీ సభ్యులను నియమించడం జరిగింది. ఈ కమిటీకి సంబంధించిన ధృవీకరణ పత్రాలను సింగరేణి మండల తహశీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు నియామక పత్రాలు చైర్మన్ ఎండీ యాకుబ్ అలీ,వైస్ చైర్మన్ షేక్ మజీద్ పాషా (షేరు),కార్యదర్శి ఎండీ సల్మా ,సభ్యులు ,షేక్ యాకుబ్ పాషా, షేక్ ఖదీర్ నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ తెలుపుతూ షాది ఖానా చైర్మన్గా బాధ్యతలు స్వీకరించడం పట్ల వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కు కృతజ్ఞతలు తెలుపుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అందించడం పట్ల సాధికార అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, సింగరేణి గ్రామ సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ), మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ తాజుద్దీన్ , మాజీ మండల కో ఆప్షన్ మెంబర్ ఎండీ హనీఫ్, నాయకులు బద్దులాల్, షేక్ షఫీ , షేక్ సద్దాం హుస్సేన్ , షేక్ ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.





# విశ్వవిద్యాలయాన్ని మరిపిస్తున్న భద్రాచలం జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల...

### మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు.

భద్రాచలం ఆగస్టు 24 జనగణమన ప్రతినిధి . భద్రాచలం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలోని వసతులు గాని విద్యార్థులు క్రమశిక్షణ తరగతులను నిర్వహణ గాని ఉపాధ్యాయుల బోధన గాని కంప్యూటర్, గణితము, సైన్స్ ల్యాబ్ నిర్వహణ మరుగుదొడ్ల నిర్వహణ గాని విశ్వవిద్యాలయాన్ని మైమరిపిస్తుందని మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. సోమవారం ప్రార్థన సమయంలో పాల్గొని కొద్దిసేపు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఉదయం ప్రార్థన కన్నా ముందే విద్యార్థులు పాఠశాలలకు హాజరై పాఠశాలలోని నిన్న ఉపాధ్యాయలు ఇచ్చిన ఇంటి పనిని పూర్తి చేయటం గమనార్హం. ఈ నేపథ్యంలో అన్ని తరగతి గదులు వసతులను స్వయంగా ఆయన పరిశీలించిన అనంతరం ఉపాధ్యాయులతోనూ విద్యార్థులతోనూ మాట్లాడి ప్రత్యేకమైనటువంటి అభినందనలు తెలియజేశారు. పాఠశాలలో హరితహారం, పరిశుభ్రత పచ్చదనం చూడముచ్చటగా ఉందని స్వయంగా విద్యార్థి కేంద్రంగా తరగతి గది బోధనా తో పాటు కిచెన్ గార్డెన్ నిర్వహణ నిర్వహించడం ప్రధాన ఉపాధ్యాయిని కృషికి నిదర్శనమని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. సుమారు 475 మంది పిల్లలు ఉన్నప్పటికీ నిశ్శబ్ద వాతావరణంలో పాఠశాల ఉండటం ఉదయం పిల్లలు ప్రార్థన కన్నా ముందే వచ్చి వారి వారి తరగతి గదిలో వారి ఇంటి పనిని పూర్తి చేసుకోవటం , క్రమశిక్షణతో ఉండటం,నిశ్శబ్దత పాటించటం చూపరాలను సైతం ఆకట్టుకుంటుంది. ఇక్కడ పనిచేసే సిబ్బంది ఉపాధ్యాయులు అంకితభావం వారి సమిష్టి కృషికి నిదర్శనమని,ఈ పాఠశాల పనితీరు లో ప్రతి ఉపాధ్యాయుడు నిరంతర కృషిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని గుర్తించాలని పిలుపునిచ్చారు..



# అశ్వారావుపేటలో అక్రమ మట్టి దందా - వ్యవస్థల నిర్లక్ష్యం

### సామాన్యుడి సొంతింటి కలపై కోలుకోలేని దెబ్బ!

అశ్వారావుపేట : ఆగస్టు 24 (జనగణమన ప్రతినిధి )చట్టాన్ని పరిరక్షించాల్సిన అధికారులు, అక్రమాలను ప్రశ్నించాల్సిన పత్రికారంగం రెండూ దారి తప్పితే ఏమవుతుందో చెప్పడానికి అశ్వారావుపేటలో జరుగుతున్న మట్టి భాగోతమే నిదర్శనం. గుర్రాల చెరువు పంచాయతీ పరిధిలోని మారుతి నగర్ ప్రాంతంతో పాటు వరద కాలువ పక్క పొలాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ మట్టి తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగుతున్నాయి. సెలవు రోజుల్లో లక్షల దందారెవెన్యూ, మైనింగ్ అధికారుల నిఘా లోపం అక్రమార్కులకు కొండంత అండగా మారింది. ముఖ్యంగా ఆదివారం అధికారుల సెలవు దినాన్ని ఆసరాగా చేసుకుని జేసీబీలు, ట్రాక్టర్లతో విచ్చలవిడిగా తవ్వకాలు జరుపుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ప్రకృతి సంపదను కొల్లగొడుతూ లక్షల రూపాయల చట్టవిరుద్ధ రాబడిని వెనకేసుకుంటున్నారు.?బ్లాక్మెయిల్ రాజకీయం కుమ్మక్కైన శక్తులుఈ దందాలో పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తుంటే, సమాజానికి అద్దం పట్టాల్సిన కొంతమంది విలేకరులు నేరుగా భాగస్వాములు కావడం గమనార్హం. జర్నలిజం ముసుగులో అక్రమార్కులకు కొమ్ముకాస్తూ, ప్రశ్నించాల్సిన చోట బెదిరింపులకు దిగుతూ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారు. అధికారులు, ఈ అక్రమ శక్తుల మధ్య నెలకొన్న అంతర్గత అవగాహనే ఈ అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా చేస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ అక్రమ మట్టితోలకాలను అదుపు చేస్తారో లేదో వేచి చూడాల్సిందే.



# గుజరాత్ ఆధిపత్యాన్ని సహించేది లేదు..

(మొదటి పేజీ తరువాయి)

## గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి నాకెందుకు అభ్యంతరం?



గుజరాత్ సీఎంకు అమెరికా, కెనడా పర్యటనకు అనుమతి ఇచ్చిన కేంద్రం తన అమెరికా పర్యనటను ఎందుకు అడ్డుకుందని నిలదీశారు. తెలంగాణకు వచ్చే సరికి విదేశీ పర్యటనలు తిరస్కరిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా, స్పోర్ట్స్ రంగంలో పెట్టుబడులతో ముందుకు వెళ్లాలన్నది మా ఆలోచనతో ముందుకు వెళ్తుంటే తనను అడ్డుకోవడం అంటే ఇది వ్యక్తిగతంగా రేవంత్ రెడ్డిని అడ్డుకోవడం కాదని నాలుగుకోట్ల మంది తెలంగాణ ప్రజలను అడ్డుకోవడం అని తెలంగాణ ప్రజలను అవమానించడం అన్నారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. ఈ తిరస్కరణకు గుజరాతీ ఆధిపత్యమేనని, నరేంద్ర మోడీ ఇప్పటికీ గుజరాత్ సీఎంగా వ్యవహరిస్తున్నారే తప్పా భారత ప్రధానిగా ఆలోచించడం లేదన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిని అమెరికా పర్యటనకు ఎనిమిది రోజుల పాటు అనుమతి ఇచ్చి తెలంగాణ ముఖ్యమంత్రికి మాత్రం రాజకీయ కారణాలతో అనుమతి తిరస్కరించడం రాష్ట్ర ప్రజలను అవమానించడమేనన్నారు.

### కుట్రతోనే అడ్డుకున్నారు..

ముఖ్యమంత్రి హోదాలో తన పర్యటనను అడ్డుకోవడం చూస్తుంటే తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షను ప్రదర్శిస్తోందని అర్థం అవుతోందని ఈ వివక్షను ఏమాత్రం సహించరానిదన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్టు చేస్తున్నారా? తెలంగాణ అభివృద్ధి బీజేపీ ఎంపీలకు అవసరం లేదా అని ప్రశ్నించారు. ఇది అంతా ఆషామాషీగా తీసుకునే విషయం కాదని రాష్ట్ర బీజేపీ నేతల మెతక వైఖరి వల్ల తెలంగాణ వ్యతిరేక భావజాలం పార్లమెంట్‌లో పదే పదే మాట్లాడుతున్నారు. ఇప్పుడు తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణకు పెట్టుబడులు వస్తే గుజరాత్?కు పెట్టుబడులు ఆగిపోతాయనే కుట్రతో తన పర్యటనను అడ్డుకున్నారని మండిపడ్డారు. రాజకీయ కారణాలతో అడ్డుకుంటున్నామని చెబుతున్నారు. మోడీది బీజేపీ నాది కాంగ్రెస్, ఆయనది గుజరాత్ నాది తెలంగాణ ఇందులో తెలియని రాజకీయ ఎజెండా ఏంటని ప్రశ్నించారు.

# స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు ప్రజల బ్రెయిన్ వాష్..

(మొదటి పేజీ తరువాయి)

### సబ్సిడీ ఎత్తేయాలని కుట్ర:

కార్పొరేట్లతో కుమ్మక్కై విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు పెట్టి పేద ప్రజలకు ఇచ్చే సబ్సిడీ ఎత్తేయాలనే కుట్రకు రాష్ట్ర ప్రభుత్వం తెరలేపిందని కవిత ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ముందు మోకరిల్లి వాళ్లు తీసుకొస్తున్న తలా తోక లేని విధానాలను సమర్థిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న మీటర్లన్నీ స్మార్ట్ మీటర్లేనని, ప్రస్తుతం రీడింగ్ కోసం పెన్ను పేపర్?తో ఏమీ రాసుకోవడం లేదు కదా అని ప్రశ్నించారు. రైతు నల్ల చట్టాల ద్వారా రైతులకు ఏ స్మార్ట్ మీటర్లు పెట్టాలని చూసిందో అదే అదానీ కంపనీకి చెందిన స్మార్ట్ మీటర్లను మరో కొత్త పథకం పేరుతో కేంద్రం తీసుకురావాలని చూస్తే ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం సంతకం పెట్టి స్మార్ట్ మీటర్లు పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. అదానీలకు కొమ్ము కాస్తూ స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, గృహ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు పెట్టాలన్న తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే యూపీలో ఇలాంటి స్మార్ట్ మీటర్లు బిగిస్తే వాటిని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న పరిస్థితి ఉందని చెప్పారు.

# సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

అధికారికంగా నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక బిల్లులు, విధానపరమైన నిర్ణయాలను సభ ముందు ఉంచే అవకాశమున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసేందుకు ప్రధాన ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, పాలిటెక్నిక్ కళాశాలల సమస్యలు మరియు రిజిస్ట్రేషన్ల చట్టంలోని వివాదాస్పద 22 ఏ జీవో అమలు పై సభలో నిలదీసేందుకు విపక్షాలు కార్యాచరణ రచిస్తున్నాయి. ప్రజా సమస్యలపై శాసనసభ వేదికగా అధికార, ప్రతిపక్షాల మధ్య వాడివేడి చర్చలు, మాటల యుద్ధం జరిగే అవకాశముండటంతో ఈ సమావేశాలపై రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# హైకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి స్వల్ప ఊరట

(మొదటి పేజీ తరువాయి)

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద సాధారణ లబ్దిదారులతో పోలిస్తే దివ్యాంగ యువతులకు 25 శాతం అదనంగా ఆర్థికసాయం అందించేలా గతంలో రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన ఉన్నత న్యాయస్థానం.. దివ్యాంగులకు ఇచ్చే ఆర్థిక సాయం ప్రక్రియను కొనసాగించేందుకు అనుమతినిచ్చింది. అనంతరం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై దాఖలైన తదుపరి పిటిషన్ల విచారణను హైకోర్టు రెండు వారాల పాటు వాయిదా వేసింది.

# భూసేకరణ వేగవంతం..

(మొదటి పేజీ తరువాయి)

వర్షపు నీటిని భూగర్భ జలాలుగా ఒడిసి పట్టేందుకు ప్రతి ఇంటా ఇంకుడు గుంత నిర్మించుకోవాలని సూచించారు. కొండాపూర్‌లో గుడిసెల్లో నివసిస్తున్న ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. గుడాల భాగ్య నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. రూ.20 లక్షలతో నిర్మించనున్న మహిళా సంఘాల భవనానికి శంకుస్థాపన చేశారు. ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

### 250 పడకల ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలి..

అంతకుముందు హుస్నాబాద్ పట్టణంలో నిర్మితమవుతున్న 250 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ నాణ్యత, ప్రమాణాల పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. నిర్మాణంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, పనులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఆసుపత్రి పూర్తయితే హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఆధునిక వైద్య సదుపాయాలు మరింత చేరువ కానున్నాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షర్మిల, డీపీవో జగదీశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సర్పంచ్ మర్క రాజ్‌కుమార్, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో రామ్మోహనాచారి, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# పత్రిక అధినేతకు బెంజ్ కారు ఎట్లొచ్చింది?..

(మొదటి పేజీ తరువాయి)

రంగారెడ్డి జిల్లా నుంచి 258, మేడ్చల్ జిల్లా నుంచి 249, సంగారెడ్డి జిల్లా నుంచి 82 కాల్స్, కామారెడ్డి జిల్లా నుంచి 41 కాల్స్ వంతున వచ్చాయన్నారు. వీటన్నింటినీ ఆయా జిల్లా కలెక్టర్లకు ఫార్వార్డ్ చేసి పరిష్కరించమని ఆదేశాలిచ్చామన్నారు. అర్హత కలిగిన ఆస్తులన్నింటినీ ఫాస్ట్ ట్రాక్ ద్వారా పీఓబీ నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు.

### ఆ 806 ఎకరాలపై విచారణ..

సీఎస్ 7, సీఎస్ 14 భూముల అంశంలో కోర్టుల ఆదేశాల మేరకు పని చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. అయితే ఓ పత్రికాధినేతకు ఎస్ క్లాస్ బెంజ్ కారు గిఫ్ట్ గా వచ్చిన అంశాన్ని గుర్తు చేశారు. ఐదు డాక్యుమెంట్ల ద్వారా 806 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేశారని, అప్పట్లో ఎఫ్ఐఆర్ కూడా బుక్ అయ్యిందన్నారు. ఆ డాక్యుమెంట్లు తప్పు అని నాటి ప్రభుత్వం అంగీకరించలేదన్నారు. సామాన్యులను అడ్డం పెట్టుకొని స్వలాభం కోసం కొందరు పని చేస్తున్నారన్నారు. ఐదు డాక్యుమెంట్ల ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన 806 ఎకరాలపై ఎంక్వయిరీ చేసేందుకు ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆ ఎండీకి ల్యాండ్ లార్డ్ పేరుతో ఉన్న కారు ఎలా వచ్చిందో కూడా తీగ లాగితే డొంక కదులుతుందన్నారు. వీటిలో 1170 డాక్యుమెంట్లు అయ్యాయన్నారు. అయితే ఈ సీఎస్ 7, 14 భూములను కూడా రిజిస్ట్రేషన్లు చేస్తున్నామని, అయితే సుప్రీంకోర్టు తుది తీర్పు మేరకేనన్న షరతులను విధించినట్లు స్పష్టం చేశారు. అయితే అలాంటివి రిపీట్ చేయాలనుకోవడం బాధాకరంగా ఉందన్నారు.

### యూఎల్సీ ల్యాండ్ పై పాలసీ..

రంగారెడ్డి జిల్లా నాదర్ గుల్ సర్వే నం.773, 775, 776, 786లో కొంత ల్యాండ్ యూఎల్సీ క్లియర్ కాలేదని మంత్రి అన్నారు. అలాగే మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి సర్వే నం.68/1, 70/1, 71 లోనూ యూఎల్సీ క్లియర్ కాని భూములు ఉన్నాయి. అలాంటి వాటిని పీవోబీలో నమోదు చేశామన్నారు. అయితే త్వరలో ఇలాంటి యూఎల్సీ ల్యాండ్ పై పాలసీ తీసుకొస్తామని, దాని ద్వారా ఎలా చేయాలన్నది నిర్ణయం ప్రకటిస్తామన్నారు. సీఎం ప్లాట్ కూడా 22ఏలో పెట్టారంటూ కొందరు విమర్శిస్తున్నారు. అయితే సర్వే నం.403లో 1288 ఎకరాలను తొలుత పీవోబీలో పెట్టారని, అందులో రెండు ప్లాట్లు మాత్రమే రెగ్యులరైజ్ కాలేదన్నారు. ఇప్పుడు దాన్ని సవరించినట్లు తెలిపారు.

### దొంగ పత్రాలపై కేసులు..

కొందరు దొంగ పత్రాలను తీసుకొచ్చి 22ఏ నుంచి తొలగించాలని అధికారులను డిమాండ్ చేస్తున్నారని మంత్రి అన్నారు. మేడ్చల్ కలెక్టర్ 2026 జూన్ 22న మెమో ఇచ్చారంటూ తీసుకొచ్చారు. అలాగే యూఎల్సీ 2026 జూన్ 2న ఇచ్చారంటూ మరొకరు వచ్చారన్నారు. వాటిని పరిశీలించి బోగస్ అని తేల్చారన్నారు. వారిపై ఎఫ్ఐఆర్ బుక్ అయ్యిందన్నారు. ఇలాంటి దొంగ పత్రాల ద్వారా ప్రభుత్వ భూములను కొల్లగొట్టాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు.

### ఒక దానికి బదులుగా మరొకటి..


సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారంలో సర్వే నం.172 ప్రభుత్వ భూమి, 173 ప్రైవేటు ల్యాండ్. అయితే అనుమతులు 173లో తీసుకొని 172లో నిర్మాణాలు చేపట్టారని మంత్రి స్పష్టం చేశారు. అలాంటి వాటిని 22ఏలో పెట్టామన్నారు. ఇలాంటివి రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనే అనేకం ఉన్నాయి. వాటన్నింటినీ 22ఏలో నమోదు చేశామన్నారు. వీటిపై ఏం సూచనలు ఇస్తారో ఇవ్వాలని ప్రతిపక్షాన్ని కోరారు. 2023 డిసెంబరు 7వ తేదీన ఎంత ల్యాండ్ అయితే పీవోబీలో ఉందో, ఇప్పుడు కూడా అంతే ల్యాండ్ నమోదు చేశామన్నారు. లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టారంటూ అబద్ధాలను ప్రచారం చేయడం వల్ల జనం భయాందోళనకు గురవుతున్నారన్నారు. పేదల ఆస్తులేవీ 22ఏలో పెట్టాలన్న ఉద్దేశ్యం తమకు లేదన్నారు. మొరిగే వాటికి తాము సమాధానం ఇవ్వమని, ప్రజలకు ఇస్తామన్నారు. ఇప్పటికే కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో రివ్యూ చేశామన్నారు. అక్కడ సర్వే ప్రాజెక్టుకు కూడా వేగవంతం చేయడానికి అవసరమైన చర్యలపై చర్చించినట్లు వివరించారు. సాదాబైనామా వంటి సమస్యలకు సర్వే ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రతి ల్యాండ్ కి జియో కో ఆర్డినేట్ల ద్వారా మ్యాపులు ఇస్తామని, ప్రతి ల్యాండ్ పార్సిల్ కి భూదార్ యూనిక్ నంబర్ ఇచ్చే ప్రక్రియ మొదలైందన్నారు.

# 'బీజేపీ నేతలతో హరీశ్ రావు వ్యాపారం'..

## బండారం బయటపడటంతో వెబ్‌సైట్ క్లోజ్
## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

జనగణమన బ్యూరో హైదరాబాద్:

రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం మరింత వేడెక్కింది. ముఖ్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వర్సెస్ మాజీ మంత్రి హరీశ్ రావు మధ్య ఆరోపణలు ప్రత్యారోపణలు హాట్ టాపిక్ అవుతున్నాయి. తాజాగా హరీశ్ రావుపై మంత్రి పొంగులేటి సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు కుటుంబ సభ్యులకు చెందిన మిల్చి మిల్క్ కంపెనీ విషయంలో పొంగులేటి విమర్శలు గుప్పించారు. అధికారంలో ఉన్నప్పుడు ఓవైపు బీజేపీ పార్టీ నేతలకు సంబంధించిన సంస్థలతో వ్యాపారాలు చేసిన హరీశ్ రావు... బండారం బయటపడటంతో తన కంపెనీ వెబ్‌సైట్‌ను మూసేశారని ఏ తప్పూ లేకపోతే కంపెనీ వెబ్‌సైట్‌ను ఎందుకు మూసేశారని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆరోపణలు గుప్పించారు.



### మీలాగా ఫాంహౌస్ ప్రభుత్వం కాదు:

ఓట్ల కోసం ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవడం హరీశ్ రావుకు మొదటి నుంచీ అలవాటేనని ప్రభుత్వ భూముల అమ్మకాలు.. పర్సంటేజీలు తీసుకోవడం... బండారం బయటపడిన తర్వాత వెబ్‌సైట్‌ను మూసేయడం... ఇలాంటి అంశాలపై హరీశ్ రావు మాట్లాడుతుంటే బీఆర్ఎస్ నేతలు కూడా సిగ్గుపడుతున్నారన్నారు. సమస్య వచ్చినప్పుడు నిజాయితీగా, జవాబుదారీతనంతో ముందుండి రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపుతుంటే బీఆర్ఎస్ నేతలు మాత్రం కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇది ప్రజా ప్రభుత్వం అని మీలాగా ఫాంహౌస్ ప్రభుత్వం కాదు హరీశ్ రావు అంటూ కౌంటర్ ఇచ్చారు.

# 'ఆయనతోనే కాలేదు.. నీ పద్దతి మార్చుకో'..

## సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ ఆర్.కృష్ణయ్య హెచ్చరిక



జనగణమన బ్యూరో హైదరాబాద్:

ఫీజు బకాయిల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం దిగిరావాలని లేదంటే ఇది రాష్ట్రమంతటా అంటుకుని మీ ముఖ్యమంత్రి సీటుకే ఎసరు తెస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. సోమవారం ఇందిరా పార్క్ వద్ద ఫీజు రీయింబర్స్ మెంట్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు చేపట్టిన ఫీజుల బకాయి-బీజేపీ లడాయి దీక్షకు మద్దతు తెలిపిన కృష్ణయ్య ఈ సందర్భంగా మాట్లాడారు. ఫీజు రీయింబర్స్ మెంట్ స్కీమ్ ను తొలగించాలనే కుట్ర సీఎం కడుపులో ఉందని గతంలో రోశయ్య హాయంలోనూ ఇలాగే కుట్ర చేస్తే తామంతా దీక్షకు దిగడంతో పాత బకాయిలు చెల్లించడంతో పాటు పథకం కొనసాగించక తప్పలేదన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం వల్లే అనేక మంది బడుగు బలహీన వర్గాల పిల్లలు ఉన్నత చదువులు చదువుకోగలుగుతున్నారన్నారు.

### రేవంత్ రెడ్డి ఇక నీ అధికారానికి సవాల్:

రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం ఉద్యమాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. తమ బకాయిల విడుదల చేయాలని కాలేజీల యాజమాన్యాలు ఆందోళన బాట పడితే వారిని బ్లాక్ మెయిల్ చేసి బ్లాక్ లిస్టులో బెట్టి బెదిరిస్తున్నారని ఇక నా లాంటి వారు ప్రశ్నిస్తే నన్ను ఆంధ్రప్రదేశ్ ఎంపీ అంటూ సీఎం మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి సమస్యను డైవర్ట్ చేయడానికే చూస్తున్నారు తప్పా పరిష్కరించడం లేదని విమర్శించారు. ఈ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాబోతోందని ఇందులో ఎలాంటి సందేహాలం లేదన్నారు. ఈ ఫీజు రీయింబర్స్ మెంట్ ఉద్యమం తెలంగాణ ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమం కంటే పెద్దగా జరగబోతోందని ఈ ఉద్యమం రేవంత్ రెడ్డి అధికారానికి సవాల్?గా మారబోతోందని హెచ్చరించారు. కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించడానికి ఉన్న నిధులు విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు లేవా? అని నిలదీశారు. నెలకు ఇన్ని కోట్ల అప్పులు చేస్తూ ఆ డబ్బులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. చదువే అన్నింటికి మూలం అని రేవంత్ రెడ్డి గొప్ప సంఘ సంస్కర్తలా మాట్లాడితే ఫీజు బకాయిలు చెల్లిస్తాడని అనుకున్నాం. కానీ ఆ మాటలు ఉపన్యాసాలకే పరిమితమయ్యాయన్నారు. ఇకనైనా రేవంత్ రెడ్డి తన తీరు మార్చుకుని విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

జనగణమన
దినపత్రిక

## సంపాదకీయం

# ఇప్పటికీ అంతే కొత్త పాళీ!

తాపీ ధర్మారావు తన జీవితంలో ఒక మూడేళ్ళపాటు ఒక్క ముక్క రాయలేదు. ఆ కాలం గురించి ఆయన ఇలా రాసారు: "...పూర్వపు రీతినే వ్రాసివేద్దామంటే, నా హృదయంలో కలిగిన మార్పు దానికి ఒప్పుకునేది కాదు. అందుచేత మౌనం కలిగింది నా కలానికి. దీనివల్ల స్నేహితులయిన పత్రికా సంపాదకులకి నాపై కోపం కూడా కలిగింది ఏమి చేయను? నాపై నాకే కోపం కలిగినపుడు ఇతరులకి కలగదా!..."1933 నుంచి 1936 మధ్య ఆ మూడేళ్ళ కాలంలోనూ చేసినదేమిటో కూడా ఆయన రాసుకున్నారు: "మూడు సంవత్సరాలు--వెయ్యిరోజులు--దాటిపోయాయి. ఒక్క ముక్క అయినా వ్రాయలేదు... ప్రచురించడం అంతకన్నా లేదు. నిజమే, కాని, చదివినది మాత్రం చాలా ఉంది. దగ్గరదగ్గర 40, 50 వేల పేజీల సారస్వతం చదవగలిగాను. సారస్వతం అంటే ఎలాంటి సారస్వతం? ...దేశదేశాలలోనూ, ఖండఖండాలలోనూ ప్రఖ్యాతి పొందిన గ్రంథాలు. వందలకొద్ది ఇతర భాషలలోకి తర్జుమా అయిన గ్రంథాలు, అన్ని జాతులవాళ్ళ పొగడ్తల్నీ, లక్షలకొద్దీ బహుమానాన్నీ పొందిన గ్రంథాలు. ప్రపంచంలోని జనులనీ, వాళ్ళ అభిప్రాయాలనీ ఒక్కసారి మార్చివేసిన గ్రంథాలు. రషియా, జర్మనీ, నార్వే, స్వీడను, ఫ్రాన్సు, ఇంగ్లండు, అమెరికా... ఈ దేశాలలో మిక్కిలి ఉత్తమమైన గ్రంథాలు. ఈ గ్రంథాలు కరువుదీర చదివాను. నా స్వభావాన్నిబట్టి చదివిన వాటిని గురించి విమర్శించుకున్నాను. ఆలోచించుకున్నాను. తరువాత ఆయా దేశాల్లో ఆ గ్రంథాలను గురించి విమర్శనలు చూశాను. నోబెల్ మొదలైన గొప్ప గొప్ప బహుమానాలు ఈ గ్రంథాలకెందుకిచ్చారో తెలుసుకున్నాను. దీని అంతటివల్ల నా అభిప్రాయాలు చాలా ఎక్కువగా మారిపోయాయి. మారక తప్పదు ఆ గ్రంథాలని చూచిన తర్వాత."ఈ మాటలన్నీ తాపీ ధర్మారావు పుస్తకం 'కొత్తపాళీ'లోని తొలి పేరాలు. రాయకుండా గడిపిన మూడేళ్ళ తర్వాత గూడవల్లి రామబ్రహ్మం నడిపిన 'ప్రజామిత్ర' పత్రికలో 1936 సంక్రాంతి సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురింపబడిన ధర్మారావు వ్యాసాలే 'కొత్తపాళి' సంపుటి. అప్పటికి ధర్మారావు వయసు నలభైకు మించలేదు. ఆయన్ను వ్యావహారిక భాషా వైతాళికుడిగా మనం కొనియాడుతాం. ఘనమైన పత్రికా సంపాదకుడిగా గౌరవిస్తాం, తెలుగు సినిమాలకు చక్కని భాషను, స్క్రీన్ ప్లే విధానాన్ని ఇచ్చిన దార్శనికుడిగా కీర్తిస్తాం. అయితే తెలుగు సాహిత్య విమర్శకుడిగానూ ఆయన పేరు గట్టిగా చెప్పాల్సిన అవసరం ఉంది. ఇటీవల మళ్ళీ వారి రచనలు 'ఇనుప కచ్చడాలు', 'దేవాల యాలపై బూతు బొమ్మలు', 'సాహిత్య మొర్మరాలు', 'పాత పాళీ', 'కొత్తపాళీ' పుస్తకాలను జాగ్రత్తగా చదివాను. సాహిత్య విమర్శను కూడా బొరుగులు తిన్నంత సులువుగా అందివ్వగలిగిన ప్రతిభాశాలి తాపీ. 'కొత్తపాళీ' గురించి చాలామంది రాశారు, శ్లాఘించారు, తాపీవారికి పర్యాయపదంగా వాడారు. అయినా ఇప్పటికీ తెలుగు పాఠకులు 'కొత్తపాళీ'ని కొత్తగా, సమగ్రంగా, సవ్యంగా చూడాల్సి ఉందనే అనిపిస్తోంది. నిజానికి తాపీధర్మారావు 'కొత్తపాళీ' ద్వారా సాహిత్యరచనకు ఒక సిలబస్ రూపొందించారు. ఏది సాహిత్యం? ఎవరి కోసం ఆ సాహిత్యం? దాని ఉద్దేశ్యం ఏమిటి? ఎలా రాయాలి? అలానే ఎందుకు రాయాలి? -- అనే విషయాలపట్ల సమగ్రమైన అవగాహన కలిగిస్తారు. అలాగే కవి లేదా రచయిత నిల్చున్న కాలానికీ, సమయానికీ -- గతాన్నీ, గత సాహిత్యాన్ని ఎలా చూడాలి? ఏమి స్వీకరించాలి? అలాగే భవిష్యత్తులో బాధ్యత ఏమిటి? అని కూడా చాలా సులువుగా బోధపడేట్టు విశ్లేషిస్తారు. సాహిత్య విమర్శకుడిగా ధర్మారావులో పాండిత్యం, విశ్లేషణ, ఓపిక విశేషంగా ఉన్నాయి. అంతకుమించి వారి విమర్శలో మనం చూడాల్సినవి మరిన్ని ఉన్నాయి: అ) సాహిత్య విమర్శను రీడబుల్‌గా రాయడమూ, ఆ) హాస్యాన్ని, వ్యంగ్యాన్ని, వెటకారాన్ని పుష్కలంగా వాడటమూ, ఇ) ఎటువంటి ద్వేషం లేకుండా సహనం, సమన్వయంతో కూడిన దృష్టితో సాహిత్య పరిశీలన చేయడమూ, ఈ) హేతుబద్ధంగా ఏది ప్రయోజనకరమో, కాదో అని విశ్లేషించి చూపడమూ, ఉ) తెలుగునూ, తెలుగు సాహిత్యాన్ని నెత్తిన పెట్టుకు అవి మరింత ఉజ్జ్వలంగా ఉండాలనడమూ -- వెరసి నవనవోన్మేషంగా తెలుగు సాహిత్య విమర్శకు కొత్తచూపు ఇవ్వడమూ. ఈ వ్యాసాలను 1955లో పుస్తకంగా వెలువరిస్తూ ఇలా అన్నారు: "...నాకు సంస్కృతం మీద ద్వేషమని కొందరయ్యలంటూంటారు. కాదు: నాకు కావాలి సంస్కృతం, కొద్దో గొప్పో ఇప్పటికీ చదువుకుంటుంటాను. అది గొప్ప రత్నాల గని. నిజమే. ఇష్టమున్నవాళ్ళు సంస్కృతం చదవవలసిందే, దానిలో ఉన్న విజ్ఞానం తెలుసుకోవలసిందే, ఆ విజ్ఞానాన్ని తెలుగులోనికి తీసుకురావలసిందే. అది కూడదనను. అనవసరంగా ఆ భాషను దిగుమతి చేయకండంటాను. తెలుగుతనం నిలుపమంటాను. అంతే..."అలాగే కొత్తపాళీ చివరి వ్యాసం చివరలో ఇలా అంటారు: "...సాహిత్యాన్ని పట్టి ఆ జాతి వారి విజ్ఞానము, జీవన విధానము, ఆచారాలు, సంస్కృతి తెలుసుకోవడానికి వీలుండాలి. సాహిత్యంలో జాతి కనబడాలి. జాతికి సాహిత్యం అద్దంలాగుండాలి.""తెలుగు కవి, తెలుగు రచయిత, తెలుగు ప్రజల జీవితంలో ఉండి వ్రాయాలి... తెలుగు సంస్కృతీ, తెలుగు గడ్డా, యుగయుగాల నుంచి వచ్చిన తెలుగు విజ్ఞానమూ తనకిచ్చిన శక్తీ, అతను తెలుగు ప్రజకి ఋణపడి ఉన్నాడు. ఆ ఋణం తీర్చాలి; తన ఇష్టం వచ్చినట్టు వినియోగించుకోకూడదు. మళ్ళీ తెలుగువాళ్ళకు తాను కొంత చెల్లించాలి," అని కూడా చెప్పారు తాతాజీ.

# ప్రధాని వాగ్దానం - కృత్రిమ మేధస్సు

'హర్ ఘర్ త్రివర్ణ', జాతీయ గీతం వందేమాతరం ఆలాపనతో మనం ఎనభయ్యవ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకున్నాం. దేశభక్తులు, దేశద్రోహులపై చర్చలు, విదేశీయులను గుర్తించి వారిని వేరు చేయడం-వెనక్కి పంపడం, ఆత్మనిర్భర భారత్, మేక్ ఇన్ ఇండియా - ఇవి స్వాతంత్ర్య దినోత్సవం నాడు చర్చించే కార్యక్రమాలు. కానీ ఈసారి కాస్త భిన్నంగా ఉంది. గౌరవనీయ ప్రధాని ప్రసంగంలో యువతను లక్ష్యంగా చేసుకున్న కొన్ని ప్రాజెక్టులకు చోటు లభించింది. వాటిలో, వచ్చే ఏడాది కోటి మంది యువతకు కృత్రిమ మేధస్సు (ఎ.ఐ)లో శిక్షణ ఇవ్వడం మీడియాలో అత్యధికంగా చర్చ జరిగిన ప్రాజెక్ట్. అంతేకాకుండా, డిజిటల్ మాధ్యమం ద్వారా పోటీ పరీక్షలకు హాజరయ్యేందుకు యువతకు కోచింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. కొద్ది నెలల క్రితమే నరేంద్ర మోడీ ప్రభుత్వానికి యువత నుంచి ఎదురుదెబ్బ తగిలిన నేపథ్యంలో, ప్రధానమంత్రి యువతను ప్రసన్నం చేసుకోవడానికి తన వంతు ప్రయత్నం చేస్తారని భావించవచ్చు. అయితే, రెండు రోజుల క్రితం విద్యావిషయాలకు సంబంధించిన లోక్‌సభ కమిటీ ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం, మన దేశంలో 73 శాతం మంది బాలురు, బాలికలు ఉన్నత మాధ్యమిక స్థాయికి చేరుకోక ముందే చదువు మానేస్తున్నారు. 10.9 లక్షల ప్రభుత్వ, ప్రభుత్వ-నిర్వహణ పాఠశాలల్లో కేవలం 90,866 పాఠశాలలు మాత్రమే ఉన్నత మాధ్యమిక స్థాయిని చేరుకోగలిగాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు దాదాపు శిధిలావస్థలో ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలను మాధ్యమిక లేదా ఉన్నత మాధ్యమిక స్థాయిలకు అభివృద్ధి చేయకపోవడంతో... చాలా మంది బాలబాలికల ఇళ్ల సమీపంలో ఉన్నత మాధ్యమిక పాఠశాలలు వుండడంలేదు. వారు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లలేకపోవడం, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే స్తోమత లేకపోవడం వల్ల, పాఠశాలలో తమ విద్యను కొనసాగించాలనే కల నెరవేరకుండానే మిగిలిపోతున్నది. ఒకవేళ ఎవరైనా ఉన్నత మాధ్యమిక స్థాయిని దాటి ఉన్నత విద్యాసంస్థలో ప్రవేశించినా - అక్కడ చివరి వరకు చదవడం సాధ్యం కాదు. జులై 2026లో ప్రచురించబడిన ఒక నివేదిక (బియాండ్ ఎన్‌రోల్‌మెంట్: ఇండియన్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ కంప్లీషన్ గ్యాప్, కళ్యాణి అయ్యర్) ప్రకారం, ఉన్నత విద్యలో ప్రవేశించిన తర్వాత కూడా 30 నుండి 50 శాతం మంది విద్యార్థులు తమ చదువును పూర్తి చేయడం లేదు. వారు తమ గ్రాడ్యుయేషన్ పూర్తి చేయక ముందే చదువు మానేస్తున్నారు. లేదా మానేయమని ఒత్తిడి వస్తున్నది. వారి చదువును కొనసాగించడానికి కుటుంబాల దగ్గర శక్తి లేకపోవడం, కుటుంబ అవసరాల కారణంగా వారు ఉద్యోగంలో చేరుతున్నారు. అదే ఆడపిల్లల విషయంలోనైతే చిన్న వయసులోనే వివాహం చేసేయడంతో చదువు మానేయాల్సి వస్తోంది. గ్రాడ్యుయేషన్ తర్వాత ప్రత్యేక ఉపాధి అవకాశాలు లేనందున, వారి చదువును కొనసాగించాల్సిన అవసరం లేదని కుటుంబాలు భావిస్తాయి. అందువల్ల, అబ్బాయిలు చదువు మానేసి కాంట్రాక్ట్ ఉద్యోగంలో చేరడం, గిగ్ వర్కర్లుగా మారడం జరుగుతుంది. నూతన జాతీయ




విద్యా విధానం-2020లో ఉన్నత విద్యలో 'జ్ఞానం' కంటే 'నైపుణ్యాల'పై ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది. కాబట్టి, నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులో ఇంటర్న్‌షిప్‌లు, బహుళ-విషయ అధ్యయనాలకు ప్రాధాన్యత ఇవ్వబడింది. ఉన్నత విద్యలో పురోగతి కోసం 2035 నాటికి స్థూల నమోదు నిష్పత్తి లేదా మొత్తం నమోదు రేటు లక్ష్యాన్ని 50 శాతానికి పెంచాలని విద్యా విధానం పేర్కొంది. అయితే, నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత, విద్య పూర్తయ్యాక తగిన ఉపాధి అవకాశాలు కల్పించకపోతే, చాలా కుటుంబాలకు తమ పిల్లల నాలుగేళ్ల చదువును కొనసాగించడం సాధ్యం కావడం లేదని తెలుస్తున్నది. సాధారణంగా, సైన్స్/సాంఘిక శాస్త్రాలలో ఏదైనా సబ్జెక్టులో అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో చదవాలనే విద్యార్థుల కోరిక తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు, ఇంజనీరింగ్, మెడిసిన్, మేనేజ్‌మెంట్ వంటి వృత్తిపరమైన సబ్జెక్టులను అభ్యసించడం పెరిగినప్పటికీ, ట్యూషన్ ఫీజులు సామాన్యుడికి అందుబాటులో లేవు. దేశంలోని ప్రఖ్యాత ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ట్యూషన్ ఫీజులు సంవత్సరానికి రూ.5 లక్షలకు పైగా ఉన్నాయి. సాధారణంగా, ఏ ప్రైవేట్ కళాశాలలోనైనా ఇంజనీరింగ్ చదవడానికి కనీస ఖర్చు సంవత్సరానికి రూ.1 లక్షకు పైగా ఉంటుంది. ఇంజనీరింగ్ చదవడానికి దేశంలో ఐఐటీలు ఉత్తమ విద్యాసంస్థలు. అవి ప్రభుత్వ విద్యాసంస్థలు అయినప్పటికీ, ఐఐటీల ట్యూషన్ ఫీజులు సంవత్సరానికి సుమారు రూ.2 లక్షలు ఉంటాయి. ప్రైవేట్ కళాశాలల్లో మెడిసిన్ చదవడానికి ట్యూషన్ ఫీజులు సంవత్సరానికి రూ.4.5 లక్షల నుండి రూ.25 లక్షల వరకు అవసరం. మరో మాటలో చెప్పాలంటే, మీరు ప్రతిభ పరంగా అగ్రశ్రేణుల్లో లేకపోతే, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు కూడా వైద్య విద్య అందుబాటులో ఉండదు. అంతే కాదు. ఈ పోటీ ప్రపంచంలో, ఇంజనీరింగ్, వైద్య, అన్ని ఇతర ప్రవేశ పరీక్షల ప్రశ్నాపత్రాలు ఎం.సి.క్యు (బహుళైచ్ఛిక ప్రశ్నలు) పద్ధతిలో తయారు చేయబడుతున్నాయి. ఫలితంగా, పాఠశాల విద్య-ప్రతిభ మాత్రమే సరిపోవడం లేదు. ప్రవేశ పరీక్షలలో విద్యార్థులకు మంచి ర్యాంకులు ఇప్పిస్తామని గొప్ప వాగ్దానాలతో వివిధ కోచింగ్ సెంటర్లు రంగంలోకి దిగుతున్నాయి. ఈ కోచింగ్ సెంటర్ల నిర్వహణ ఖర్చుల బాధ్యత కూడా కుటుంబాలపైనే పడుతుంది. అంతేకాకుండా, వైద్య విద్య ప్రవేశ పరీక్ష-నీట్ 2026 ప్రశ్నాపత్రం లీక్ అవ్వడంతో ఆ పరీక్ష రద్దు చేయబడింది. దీనికి సంబంధించి మనం అపూర్వమైన విద్యార్థి ఉద్యమాన్ని చూస్తున్నాము. ఈ కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు కూడా ఆ ప్రశ్నాపత్రం లీక్‌లో పాలుపంచుకున్నారు. కాబట్టి సహజంగానే, ప్రస్తుతం ఈ ప్రవేశ పరీక్షలన్నింటిలో ఎంత ప్రతిభను పరిగణనలోకి తీసుకుంటున్నారు? ఎంత డబ్బు ఖర్చు చేస్తున్నారు? అనే ప్రశ్న తలెత్తుతుంది. ఫలితంగా, చాలా మంది విద్యార్థులు ఉన్నత మాధ్యమిక విద్య ఉత్తీర్ణులైన తర్వాత కూడా ఉన్నత విద్యాలయాలలోకి ప్రవేశించలేకపోతున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో, విద్యా రంగంపై కేంద్ర ప్రభుత్వ వ్యయం రూ.1,28,650 కోట్లుగా ఉంది. ఇందులో, పాఠశాల విద్యకు రూ.78,572 కోట్లు, ఉన్నత విద్యకు రూ. 50,078 కోట్లు కేటాయించారు. ఈ కేటాయింపులో, దేశంలోని 27 ఐఐటీలకు రూ. 12,123 కోట్లు, 56 కేంద్ర విశ్వవిద్యాలయాలకు రూ. 17,440 కోట్లు కేటాయించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎ.ఐ)లో పరిశోధన కోసం సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయడానికి బడ్జెట్‌లో అధిక భాగాన్ని కేటాయించారు. ప్రపంచంలో భారతీయ విద్యా సంస్థలను ఉన్నత స్థానంలో నిలపడానికి ప్రపంచ స్థాయి విద్యా సంస్థల అవసరం నిస్సందేహంగా ఉంది. కానీ పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్నత విద్య నుండి మధ్యలోనే మానేస్తున్నప్పుడు... పరిమితంగా వున్న ప్రపంచ స్థాయి విద్యా సంస్థలు ఈ వెనుకబడిన విద్యార్థుల జీవితాలలో ఎలాంటి మార్పును తీసుకురాలేవు. విద్య ప్రాథమిక అవసరాలను పక్కన పెడితే, దేశంలోని 15 నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సుగల 27 శాతం యువత భవిష్యత్తుకు సంబంధించిన వృత్తికి ప్రాధాన్యత ఇవ్వకుండా ఏ విద్యా వ్యవస్థను మెరుగుపరచలేము. బడ్జెట్ కేటాయింపులు, ప్రాజెక్టులలో ఆకర్షణీయమైన వాగ్దానాలు చేసినప్పటికీ, విద్యా వ్యవస్థను మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం చాలా తక్కువ వనరులను వినియోగిస్తున్నది. ఈ పరిస్థితుల్లో, స్వాతంత్ర్య దినోత్సవం నాడు కోటి మంది యువతకు కృత్రిమ మేధస్సు (ఎ.ఐ) లో శిక్షణ ఇస్తామని ప్రధాని ప్రకటించారు. అయితే ఏ స్థాయి శిక్షణ ఇస్తారు, శిక్షణ తర్వాత ఎలాంటి ఉపాధి అవకాశాలు కల్పిస్తారు అనే దానిపై స్పష్టత లేదు. కానీ ఒక విషయం మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. అదేమిటంటే, ప్రపంచంలోని ఇతర దేశాలలో నూతన సాంకేతికతలలో జరుగుతున్న పురోగతిలో మన యువతను భాగస్వాములను చేయాలంటే...కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయి విద్యకు ప్రాధాన్యత ఇవ్వకుండా కేవలం స్వల్పకాలిక శిక్షణతో ఎటువంటి పురోగతి సాధ్యం కాదు. ముఖ్యంగా గణితం, సైన్స్, భాష, సాంఘిక శాస్త్రం వంటి ప్రాథమిక విషయాలలో జ్ఞానాన్ని సంపాదించడం చాలా అవసరం. ఎ.ఐ పై ప్రభుత్వం అనేక ప్రాజెక్టులను ప్రకటించింది. కానీ ఈ ప్రాజెక్టుల లక్ష్యం అంత స్పష్టంగా లేదు, భవిష్యత్తులో ఎలాంటి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చనే దానిపై కూడా నిర్దిష్ట ప్రకటన లేదు. మరి అలాంటప్పుడు ప్రధానమంత్రి అకస్మాత్తుగా ఇలాంటి ప్రకటన ఎందుకు చేశారన్నదే ప్రశ్న. 2020 స్వాతంత్ర్య దినోత్సవం నాడు, రాబోయే 1000 రోజుల్లో భారతదేశంలోని ప్రతి గ్రామానికి హై-స్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులోకి వస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ వాగ్దానం చేశారు. 2024లో, 95.15 శాతం గ్రామాలకు 3జి లేదా 4జి మొబైల్ కమ్యూనికేషన్ ద్వారా ఇంటర్నెట్ సదుపాయం ఉందని కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ నివేదించింది. కానీ ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే, ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ వేగంలో భారతదేశం 101వ స్థానంలో, మొబైల్ ఇంటర్నెట్ వేగంలో 37వ స్థానంలో ఉంది. దీని అర్థం, హై-స్పీడ్ ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తామన్న ప్రధాని వాగ్దానం నెరవేరడానికి ఇంకా చాలా దూరంలో ఉంది. జులైలో మనం చూసిన అపూర్వమైన విద్యార్థి ఉద్యమం, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ముగిసింది. కానీ పోరాటం ఇంకా ముగియలేదు. విద్యారంగంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరి (ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల) ముందు ఇంకా సుదీర్ఘ పోరాటం ఉంది. భారతదేశంలోని అధికశాతం మంది పిల్లలకు చదువుకునే అవకాశాన్ని దూరం చేయడానికి ఒక పథకం రూపొందించబడుతోంది. మనం ఈ చక్రాన్ని వెనక్కి తిప్పాలి. అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల మౌలిక సదుపాయాలు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఉండేలా చూడటంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలి. ప్రభుత్వ విద్యాసంస్థలను గ్రాడ్యుయేషన్ స్థాయి వరకు ఉచితంగా అందించాలి. ప్రైవేట్ విద్యాసంస్థల ట్యూషన్ ఫీజులను నియంత్రించడానికి ఏర్పాట్లు చేయాలి. ఒక్క విద్యార్థి కూడా అవకాశాలకు దూరం కాకుండా చూడటంపై మనం దృష్టి పెట్టాలి. ఏ దేశమూ తన ప్రజలలో అధిక శాతం మందిని వెనుక వదిలేసి ఎన్నడూ అభివృద్ధి చెందలేదు, భవిష్యత్తులోనూ సాధించలేదు.

**నందినీ ముఖర్జీ**

# నల్ల మల్లెల గంధమా

సూరుకిందకూసున్నదిరాత్రి!
పదాన్నిబానిసనుచేసేనీరాగంకోసం
కరిమబ్బుగురిచూసివిసిరిన
ఎన్నెలసినుకేతల్లినీపాట!
నల్లరేగడిమన్నుపెయిమీదచెమటముత్యాలుమెరిసి
తునికిపండ్లతీయనిగొంతులోజాలువారిన
పచ్చపచ్చనిసేనుసేనంతాపరవశాలపైరగాలినీపాట
తల్లిగారితొవ్వమరిసినతగదప్పనికట్టం
ఇరాంలేదుఇంట్లేంలేదు. ఉన్నాయిమొండిరెక్కలే!
ఉడుకుడుకుగంజిల
ఉప్పేసుకొనితాగినట్టు
నెగులనియ్యనిదునియల
నెరివడ్డబతుకు
కంకాయిపొదలేఅవ్వా!
నీకన్నీటినదులేఅవ్వా!
పిల్లతొవ్వలగుండెలనిండా
నీపాదాలగాయాలకుపసరుపూసినిమిరిన
నల్లాలంపూలపాయిరం
ఎండినదొక్కకుగుంజికట్టిననడికట్టు
ఆకలినికట్టేసినఅగ్గెనగండ్లకాలం
పెరిగిపెరిగిబరువెక్కేజల్మ
బతుకంతాకన్నీటిగంగలమునిగి
పాడేమీదతేలిపోతివి
నాకుజ్వరంభూతంపట్టినప్పుడల్లా
నువుశివమూగిననరసింహస్వామైనాకుకావలి
నాచుట్టూపసుపుకుంకుమలపొలి
నీనోటపలికేపదాలునీపాదాలకుమోకరిల్లి
ఎన్నిలవాకిట్లఎగిసి
మొగులునందుకుంటున్నాయి
నీసనుబాలునారక్తంలోపొంగి
పాటలైపారుతున్నాయి
నీరాగమద్దుకున్ననాగొంతు
వెయ్యావుళ్ళపయ్యకోడెరంకె



## ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో గ్రామ/వార్డు సభలు నిర్వహించాలి

**– రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



మంచిర్యాల,ఆగస్టు 24, జనగణమన ప్రతినిధి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 27 వ తేదీన గ్రామ/వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు,ఈ.ఆర్.ఓ లు, ఎ.ఈ.ఆర్.ఓ. లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గ్రామ/వార్డు సభల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎస్ఐఆర్ లో భాగంగా ఈ నెల 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో గ్రామ/వార్డు సభలు నిర్వహించి ముసాయిదా ఓటర్ల జాబితా, ఎ.ఎస్.డి.(ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్) జాబితా బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్ల సమక్షంలో చదివి వినిపించాలని తెలిపారు. గ్రామ/వార్డు సభల నిర్వహణ సమయంలో బూత్ స్థాయి అధికారులు ఫారం-6, 7, 8 అందుబాటులో ఉంచుకోవాలని, ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే నోట్ చేసుకోవాలని తెలిపారు. అనామోలీస్, మ్యాపింగ్ కానీ ఓటర్లకు సంబంధించిన వివరాలు బూత్ స్థాయి అధికారుల ద్వారా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని, పెండింగ్ లో ఉన్న నోటీసుల జనరేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి నోటీసులు అందించాలని తెలిపారు. అవసరం ఉన్నచోట అదనపు ఎ.ఈ.ఆర్.ఓ.ల సంబంధిత ప్రతిపాదనలు రేపటి లోగా పంపించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో అనామోలీస్, మ్యాపింగ్ కానీ ఓటర్లకు సంబంధించిన నోటీసుల జనరేషన్ దాదాపు పూర్తి కావచ్చిందని, నోటీసులను సంబంధిత ఓటర్లకు 3 రోజులలోగా అందిస్తామని తెలిపారు. కార్యాచరణ ప్రకారం గ్రామ/వార్డు సభలు నిర్వహించడం జరుగుతుందని, అదనపు ఎ.ఈ.ఆర్.ఓ ల సంబంధిత ప్రతిపాదనలు పంపించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల రాజస్వ మండలాధికారి శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, అన్ని మండలాల తహసిల్దార్లు, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచుల హక్కులు గ్రామాల అభివృద్ధికి కృషి

**– రాష్ట్ర సర్పంచుల సంఘం సెక్రటరీగా పోచయ్య**




ఆసిఫాబాద్ ఆగస్టు 24 జనగణమన ప్రతినిధి తెలంగాణ రాష్ట్రంలోని సర్పంచుల హక్కులు, గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి ఉంటుందని రాష్ట్ర సర్పంచుల సంఘం జాయింట్ సెక్రటరీ, రాజంపేట గ్రామపంచాయతీ సర్పంచ్ బుర్రా పోచయ్య అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ ల సంఘం జాయింట్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయనను రాజంపేట గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఆయన నాయకత్వంలో సర్పంచ్‌ల హక్కులు, గ్రామాల అభివృద్ధి కోసం మరింత బలంగా ముందుకు సాగాలని పాలకవర్గం సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుల జిల్లా కన్వీనర్ గులాం జావిద్, ఉపసర్పంచ్ మామిడి లక్ష్మీ, వార్డు సభ్యులు బొట్టుపల్లి లావణ్య, త్రిశూల నానయ్య, కొమరం వేణు, బుర్రా భూపతి, పంచాయతీ సెక్రటరీ సాయి కృష్ణ, బిల్ కలెక్టర్ నాగేంద్ర, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

**– ప్రిన్సిపాల్ దుర్గం మహేశ్వర్**



ఆసిఫాబాద్ ఆగస్టు 24 జనగణమన ప్రతినిధి : ఆసిఫాబాద్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 20వ తేదీన ఆసిఫాబాద్ గిరిజన పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా కేంద్రం లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఏ భారతి ఇంటర్మీడియట్, 400 మీటర్స్ లో అత్యంత ప్రతిభ కనబరిచిందని, మరో విద్యార్థి నిఖిలేష్ షార్ట్ పుడ్ లో, వీరు ఈనెల 26, 27, తేలలలో హన్మకొండలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అట్లాంటిక్ పోటీలకు ఎంపికైనట్లు ఆదర్శ పాఠశాల, కళాశాల, ప్రిన్సిపాల్ దుర్గ మహేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దుర్గ మహేశ్వర్, ఉపాధ్యాయుడు మల్లేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు బి తిరుపతి, లు మాట్లాడుతూ విద్యార్థినిలు జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని అన్నారు.

# మెదక్ జిల్లాలో వైద్య సేవల బలోపేతానికి చర్యలు

**క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ఆకస్మికంగా పరిశీలించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**త్వరలో ప్రారంభానికి సన్నాహాలు.. తూప్రాన్‌లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు**



ఉదయవాణి ప్రతినిధి :జనగణమన ప్రతినిధి 24, 2026 మెదక్ జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. మెదక్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్‌ను స్థానిక ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌తో కలిసి మంత్రి ఆకస్మికంగా పరిశీలించారు.క్రిటికల్ కేర్ బ్లాక్‌ను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై అనంతరం మంత్రి సమీక్ష నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. సునీత దేవి, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా. నితిన్ కబ్రా, డీఎంహెచ్‌వో డా. జ్ఞానేశ్వర్, డీసీహెచ్‌ఎస్ డా. శివ దయాళ్‌తో పాటు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.ఈ సమీక్షలో పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కూడా పాల్గొన్నారు. **25న సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష** క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభానికి అవసరమైన మానవ వనరులు (HR), వైద్య పరికరాలు, మౌలిక వసతులు, IHFMS సేవలు అందుబాటులోకి తీసుకురావడంపై ఆగస్టు 25న హైదరాబాద్ సచివాలయంలో నిర్వహించే ఉన్నతస్థాయి సమావేశానికి హాజరుకావాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.మెదక్ లిలిప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (GGH)*లో వైద్య సేవల బలోపేతం, నూతన భవన నిర్మాణం, ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులకు హాస్టల్ నిర్మాణం తదితర అంశాలపై కూడా మంత్రి సమీక్షించారు.**తూప్రాన్‌లో ట్రామా కేర్ సెంటర్** రోడ్డు ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు వేగంగా వైద్య సేవలు అందించేందుకు తూప్రాన్‌లో ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు.జిల్లాలోని నర్సాపూర్, రామాయంపేట, కౌడిపల్లి, తూప్రాన్ ప్రాంతాల్లో కిడ్నీ రోగులకు అందిస్తున్న డయాలసిస్ సేవల పరిస్థితిని కూడా మంత్రి సమీక్షించారు.మెదక్ జిల్లాలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సిబ్బంది, పరికరాలు, మౌలిక వసతులు, ఇతర అవసరాలపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు.


## ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి

**– జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల,ఆగస్టు 24, జనగణమన ప్రతినిధి ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి. రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన ఝాన్సీ స్వయం సహాయక సంఘం సభ్యులు తమ సంఘంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన మహమ్మద్ మక్బూల్ పెద్ద మనుషుల సమక్షంలో జరిగిన ఒప్పందం ప్రకారం తనకు రావలసిన వాటాను ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రగతినగర్ వాసులు తమ కాలనీలో రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన కొండగొర్ల చంద్రశేఖర్ తమకు కన్నేపల్లి మండలం పోలంపల్లి శివారులో గల భూమి ఆన్ లైన్ లో ఇతరుల పేరిట నమోదు అయిందని, ఈ పొరపాటున సవరించి తమ పేరిట మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం ఊత్కూర్ కు చెందిన తనుగుల సందీప్ కుమార్ తాను, తన భార్య దివ్యాంగులమని, నిరుపేదలమని, తమకు జీవనోపాధి కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలోని భగత్ సింగ్ నగర్ టు చెందిన ఎం.ప్రభావతి తనకు కొంత స్థలం ఉందని ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. వేమనపల్లి మండలం ముల్కలపేట గ్రామానికి చెందిన తగరం పరంజ్యోతి తమ భూమి నిషేధిత జాబితాలో చూపుతోందని, సవరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండలం నంబాల గ్రామానికి చెందిన శనిగారపు బాపు తమ ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయిందని, భూమి కాగితాలు, ఖరీదైన వస్తువులు, మంచాలు, బట్టలు పూర్తిగా కాలిపోయాయని, తమ కుటుంబానికి నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆదేశాల మేరకు విత్తనాలు కొనుగోలు చేసుకుని రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



ఇబ్రహీంపట్నం 24 జనగణమన ప్రతినిధి వానకాలం 2026 బోనస్ కు ఎంపిక చేసిన ఏడు వరి సన్నరకాలు – బీపీటీ 5207, తెలంగాణ సోనా, ఖచీవీ 1638, ఖచీవీ 7751, జై శ్రీరామ్, ఔ+ూ-44, ఎమీ సోనా రకాల వడ్లు సాగు చేస్తున్న రైతులు విత్తనం కొన్న డీలర్ వద్ద తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలి. యూనివర్సిటీ సీడ్ మేళ, రీసెర్చ్ సెంటర్ వద్ద ఈ రకం విత్తనాలు కొనుగోలు చేసినట్లయితే రైతులు సశీబంధితదిత ఏ ఈ ఓ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఇబ్రహీంపట్నం మండలంలోని రాఘవేంద్ర ఫెర్టిలైజర్స్ తనిఖీ చేసి, ఇట్టి వరి రకాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రానున్న 10 రోజులలో ఇట్టి రిజిస్ట్రేషన్ పూర్తి చేయించుకోవాలనీ విజ్ఞప్తి చేస్తున్నారు, ఆర్, శశిధర్ రెడ్డి సహాయ వ్యవసాయ సంచాలకులు ఇబ్రహీంపపట్నం వ్యవసాయ అధికారి విద్యాధరి.

# ఆగస్టు 28నే రాఖీ పండుగ.. పండితుల స్పష్టత!

**ఉదయం 6:23 నుంచి 9:48 వరకు రాఖీ కట్టేందుకు శుభసమయం**

**మధ్యాహ్నం 12:14 నుంచి 1:05 వరకు అభిజిత్ ముహూర్తం**

జనగణమన ప్రతినిధి హైదరాబాద్ । ఆగస్టు 24:అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే రాఖీ పౌర్ణమి (రక్షాబంధన్) పండుగను ఈ ఏడాది ఆగస్టు 28న జరుపుకోవాలని పండితులు స్పష్టం చేశారు.శ్రావణ పౌర్ణమి తిథి ఆగస్టు 27 ఉదయం 9:08 గంటలకు ప్రారంభమై, ఆగస్టు 28 ఉదయం 9:48 గంటల వరకు కొనసాగుతుందని పండితులు పేర్కొన్నారు. పౌర్ణమి తిథిని పరిగణనలోకి తీసుకొని ఆగస్టు 28న రాఖీ పండుగ జరుపుకోవడం శ్రేయస్కరమని తెలిపారు.రాఖీ కట్టేందుకు ఆగస్టు 28 ఉదయం 6:23 గంటల నుంచి 9:48 గంటల వరకు అత్యంత శుభప్రదమైన సమయంగా పేర్కొన్నారు. అలాగే మధ్యాహ్నం 12:14 గంటల నుంచి 1:05 గంటల వరకు ఉండే అభిజిత్ ముహూర్తం కూడా రాఖీ కట్టేందుకు అనుకూలమైన సమయమని వివరించారు.ఈ ఏడాది భద్ర కాలం సూర్యోదయానికి ముందే ముగిసిపోతుండటంతో, ఆగస్టు 28న రాఖీ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవడానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని పండితులు వెల్లడించారు.రక్షాబంధన్ సందర్భంగా సోదరీమణులు తమ సోదరుల చేతికి రాఖీ కట్టి వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శ్రేయస్సును కోరుకుంటారు. సోదరులు తమ సోదరీమణులకు అండగా ఉంటామని భరోసా ఇస్తూ కానుకలు అందించడం ఆనవాయితీ.రాఖీ పండుగ తేదీపై నెలకొన్న సందిగ్ధతకు పండితుల స్పష్టతతో తెరపడగా, ఆగస్టు 28న పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకునేందుకు కుటుంబాలు సిద్ధమవుతున్నాయి.

## వన మహోత్సవం లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

**– రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**




మంచిర్యాల,ఆగస్టు 24, జనగణమన ప్రతినిధి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం -2026 కార్యక్రమంలో భాగంగా కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం రాష్ట్ర మంత్రి ఛాంబర్ నుండి, హైదరాబాద్ నుండి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వినయ్ కుమార్ తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా అటవీ అధికారులతో వనమహోత్సవం- 2026 లక్ష్యసాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి మాట్లాడుతూ భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 56 శాతం లక్ష్యాలను పూర్తి చేయడం జరిగిందని, కేటాయించిన లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో కృషి చేసి మొక్కలు నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. లోటు వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నిర్దేశిత లక్ష్యాలను చేరుకోలేకపోయామని, ఇక నుండి కురిసే వర్షాల నీటిని ఒడిసిపట్టి, నిల్వచేసి సెప్టెంబర్ చివరి వారం లోగా 100 శాతం లక్ష్యాలను సాధించాలని తెలిపారు. అటవీ శాఖ నర్సరీలలో తగినన్ని మొక్కలు అందుబాటులో ఉన్నాయని, గుర్తించబడిన ప్రాంతాలలో ఎంపిక చేసిన మొక్కలు నాటాలని తెలిపారు. మొక్కలను నాటడమే కాకుండా సంరక్షణ కూడా చేపట్టాలని, నాటిన ప్రతి మొక్క బ్రతికేలా చూడాలని, పశువులు, జంతువుల నుండి కాపాడేందుకు నాటిన మొక్కలకు ట్రీగార్డ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అర్బన్ ఫారెస్ట్ లలో విరివిగా మొక్కలు నాటాలని, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేయాలని, దేవాలయాల ప్రాంగణాలలో ప్రత్యేకమైన ఎంపిక చేసిన మొక్కలను నాటేందుకు అటవీశాఖ అధికారులు కృషి చేయాలని తెలిపారు. వన మహోత్సవం లక్ష్యాలను పూర్తి చేయడంలో భాగంగా ప్రజలందరికీ తెలిసే విధంగా మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో వనమహోత్సవం-2026 లో భాగంగా 41 లక్షల మొక్కలను లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటి వరకు 27 లక్షల మొక్కలను నాటడం జరిగిందని, నిర్ణీత గడువులోగా 100 శాతం లక్ష్యాలను సాధించే దిశగా అధికారుల సమన్వయంతో కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీల కులగనన చేపట్టి,రిజర్వేషన్లు కల్పించాలి



ఆసిఫాబాద్ ఆగస్టు 24 జనగణమన ప్రతినిధి బీసీల సమగ్ర కులగణన చేపట్టి, జనాభా ప్రాతిపదికన న్యాయమైన రిజర్వేషన్లు కల్పించాలని సోమవారం బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్ ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రూప్నర్ రమేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణలో బీసీల సమగ్ర కుల గణనను శాస్త్రీయంగా, పారదర్శకంగా నిర్వహించి, బీసీల వాస్తవ జనాభాను కులాల వారీగా అధికారికంగా నమోదు చేయాలని కోరారు. బీసీలకు విద్యా, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం తదితర రంగాలలో జనాభా నిష్పత్తికి అనుగుణంగా న్యాయం జరగాలంటే ఖచ్చితమైన జనాభా గణాంకాలు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అందువల్ల కులాల వారీగా సమగ్ర జనాభా లెక్కలు సేకరించి, ఆ గణాంకాల ఆధారంగా బీసీ రిజర్వేషన్లను పెంచి, జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ కుటుంబాలన్నీ కులదనలో నమోదు అయ్యేలా శాస్త్రీయ విధానాన్ని అమలు చేయాలని, బీసీలకు రాజ్యాంగబద్ధంగా లభించాల్సిన హక్కులు అమలుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రైతాంగ ఉద్యమ నేత సారంపల్లి మల్లారెడ్డి మృతి బాధాకరం

**మంత్రి దామోదర్ రాజనర్సింహా**

**రైతుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన నాయకుడు.. ఆయన సేవలు చిరస్మరణీయం**



జనగణమన ప్రతినిధి హైదరాబాద్। ఆగస్టు 24, 2026 సీపీఎం సీనియర్ నాయకులు, ప్రముఖ రైతు ఉద్యమ నేత సారంపల్లి మల్లారెడ్డి మృతి పట్ల రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి. దామోదర్ రాజనర్సింహ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.మల్లారెడ్డి మరణవార్త తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్న మంత్రి, రైతుల హక్కుల కోసం, వ్యవసాయ రంగ సమస్యల పరిష్కారం కోసం ఆయన జీవితాంతం పోరాటం చేశారని గుర్తుచేశారు.సాగునీటి రంగంపై విశేష పరిజ్ఞానం, లోతైన అవగాహన కలిగిన నాయకుడిగా మల్లారెడ్డి రైతాంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని కొనియాడారు.రైతు సంఘం నేతగా, అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా రైతుల సమస్యలను ముందుకు తీసుకెళ్లి, వారి హక్కుల సాధన కోసం అనేక ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.రైతాంగం కోసం మల్లారెడ్డి చేసిన పోరాటాలు, అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని మంత్రి తెలిపారు.సారంపల్లి మల్లారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు, అనుచరులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# 7 రద్దు చేయాలని పాలిటెక్నిక్ విద్యార్థుల డిమాండ్



ఉప్పల్, ఆగస్టు24 జనగణమన ప్రతినిధి జీవో నెంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ పాలిటెక్నిక్ విద్యార్థులు కొంతకాలంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల సమస్యలను ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లి, వారికి మద్దతుగా నిలవాలని కోరారు.విద్యార్థుల విజ్ఞప్తిపై ఎంపీ ఈటల రాజేందర్ సానుకూలంగా స్పందించారు. సమస్య పరిష్కారం కోసం విద్యార్థులకు అండగా ఉంటామని, వారి న్యాయమైన పోరాటానికి పూర్తి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు.విద్యార్థులను వెంట తీసుకెళ్లి వారి సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లిన రామంతపూర్ బీజేపీ సీనియర్ నాయకుడు గడ్డం సాయి కిరణ్‌తో పాటు పలువురు పాలిటెక్నిక్ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా స్థలాల పరిరక్షణ కోరుతూ ప్రజావాణిలో వి హెచ్ పి ఆధ్వర్యంలో ఎంపీడీఓ కి వినతిపత్రం



వేములవాడ, జనగణమన ప్రతినిధి వేములవాడ పట్టణంలోని 11వ వార్డు పరిధిలో గల సర్వే నంబర్లు 1389, 1390, 1391లో జరుగుతున్న నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, ప్రజా ప్రయోజనాలకు కేటాయించిన స్థలాలను పరిరక్షించాలని కోరుతూ సోమవారం మండల అభివృద్ధి అధికారి అర్బన్ కి మండల స్థాయి ప్రజావాణిలో విశ్వహిందూ పరిషత్ వి హెచ్ పి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ నాయకులు మాట్లాడుతూ, నివాస ప్రాంతంలో ఉన్న సదరు సర్వే నంబర్లలో ఇప్పటికే మసీదు నిర్మాణం జరిగిందని, అలాగే లేఅవుట్‌లో ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలంలో షాదీఖానా నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఈ నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, భూమి వినియోగం, లేఅవుట్ రికార్డులు తదితర అంశాలను సంబంధిత రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు సమగ్రంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా లేదా అవసరమైన అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినట్లు విచారణలో తేలితే, సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 11వ వార్డు ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాన్ని ఓపెన్ జిమ్, పార్కు, గ్రంథాలయం ఏర్పాటుకు వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై గతంలో వేములవాడ మున్సిపల్ కమిషనర్ గారికి సమర్పించిన వినతిపత్రాల జిరాక్స్ ప్రతులను కూడా తాజా వినతిపత్రానికి జత చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షులు పల్లె శ్యామ్ సుందర్ రెడ్డి, కార్యదర్శి గుండు జి. గోపాల్, జిల్లా కార్యదర్శి గడప కిషోర్ రావు, తిప్పర్తి సాయి కృష్ణ పాల్గొన్నారు. ప్రజా ప్రయోజనాలకు కేటాయించిన స్థలాలు భవిష్యత్తులో కూడా ప్రజల అవసరాలకు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు తక్షణమే రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి, చట్టబద్ధమైన చర్యలు చేపట్టాలని వి హెచ్ పి నాయకులు కోరారు.

# ప్రతి వ్యక్తి, ప్రతి ఇంటికి ఒక మొక్క అందించేలా విస్తృతంగా వన మహోత్సవ కార్యక్రమాలు చేపట్టాలి

**అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**




రంగారెడ్డి జిల్లా 24 జనగణమన ప్రతినిధి వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 56.46 శాతం మొక్కల పెంపకం పూర్తయిందని ఈ నెల 25న నిర్వహించనున్న ప్రత్యేక వన మహోత్సవ కార్యక్రమం ద్వారా నిర్దేశిత లక్ష్యానికి అదనంగా కనీసం 10 శాతం మేర మొక్కలు నాటేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి సూచించారు. వన మహోత్సవం కార్యక్రమం అమలు పై సోమవారం అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మంత్రి జిల్లా వారీగా మొక్కలు నాటే లక్ష్యాలు ఇప్పటి వరకు సాధించిన పురోగతిని సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 23వ తేదీ నాటికి రంగారెడ్డి జిల్లాలో 78.540 లక్షల మొక్కలు నాటే లక్ష్యానికి గాను 45.287 లక్షల మొక్కలు నాటి 57.66 శాతం సాధన నమోదైనట్లు సమీక్షలో వెల్లడైంది.రాష్ట్రవ్యాప్తంగా 1606.286 లక్షల మొక్కల లక్ష్యానికి గాను 906.853 లక్షల మొక్కలు నాటి 56.46శాతం సాధన నమోదైంది.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 25న నిర్వహించనున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించి, "ఒక్క వ్యక్తికి ఒక మొక్క -- ఒక్క ఇంటికి ఒక మొక్క" అనే విధంగా ప్రజల భాగస్వామ్యంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని సూచించారు.ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, పరిశ్రమల ప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామ ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వీఐపీలు, రైతులు, యువత, సామాజిక సంస్థలు, మీడియా ప్రతినిధుల ను కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు.దేవాలయాల్లో ప్రత్యేకంగా మొక్కలు నాటాలి దేవాలయాలకు ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన వృక్ష జాతులను గుర్తించి, ఆయా చెట్ల మొక్కలను సేకరించి దేవాలయ ప్రాంగణాల్లో నాటాలని మంత్రి సూచించారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు సంప్రదాయంగా ప్రాధాన్యత కలిగిన వృక్ష జాతులను సంరక్షించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.ఆరోగ్యకరమైన, నాణ్యమైన మొక్కల పంపిణీఅన్ని నర్సరీల్లో తగినంత మొక్కలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలకు ఆరోగ్యకరమైన, నాణ్యమైన మొక్కలను మాత్రమే పంపిణీ చేసి నాటించాలని అధికారులను ఆదేశించారు. మొక్కల సేకరణ, రవాణా, గుంతల ఏర్పాటు, నాటడం, అనంతరం నీటి వసతి కల్పించడం వంటి అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్టులకు ప్రాధాన్యత పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచేందుకు అర్బన్ ఫారెస్టుల ఏర్పాటును ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. మున్సిపాలిటీల పరిధిలో ప్రజల భాగస్వామ్యంతో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టి పట్టణాల్లో పచ్చదనాన్ని మరింత పెంచాలని ఆదేశించారు.చెరువుల పరిసరాల్లో తాటి మొక్కల పెంపకంతాటి మొక్కలను చెరువుల పరిసర ప్రాంతాల్లో, అలాగే గౌడ సమాజానికి చెందిన భూముల్లో నాటేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక దృష్టి ఈ సీజన్‌లో తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో మొక్కల పెంపకంతో పాటు భూగర్భ జలాల పెంపుపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. నీటి సంరక్షణకు అనువైన ప్రాంతాలను గుర్తించి, అక్కడ నీటి నిల్వ మరియు భూగర్భ జలాల పెంపునకు అవసరమైన గుంతలు, ఇతర చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ నెల 25న నిర్వహించనున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, మొక్కల సేకరణ, రవాణా, గుంతల ఏర్పాటు, మొక్కలు నాటడం, నీటి సదుపాయం తదితర ఏర్పాట్లను పూర్తిచేసి కార్యక్రమాన్ని పెద్దఎత్తున విజయవంతం చేయాలని మంత్రి ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ లో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కే. కిరణ్మయి, జిల్లా అటవీ అధికారి (ఇఖీూ) శివ ఆశిష్ సింగ్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, డి. ఈ.ఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ అధికారి సుజాత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 33వ డివిజన్‌లో నాలుగు ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం

**- పేదల సొంతింటి కల సాకారం**



మంచిర్యాల, ఆగస్టు 24,జనగణమన ప్రతినిధి మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 33వ డివిజన్‌లో నిర్మించిన నాలుగు ఇందిరమ్మ ఇళ్లను మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్‌సాగర్‌రావు సోమవారం ప్రారంభించారు. నూతన గృహాల్లోకి అడుగుపెడుతున్న లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా సురేఖ లబ్ధిదారులతో ఆప్యాయంగా మాట్లాడి, ఇళ్లను పరిశీలించి శుభాకాంక్షలు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని పేర్కొన్నారు. ఇళ్లు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, సురేఖలకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సురేఖను లబ్ధిదారులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సల్ల రమ్య--మహేష్, కార్పొరేటర్లు ఎంబడి కుమారస్వామి, తాళ్ల సంపత్‌రెడ్డి, ఖలీద్, టీపీసీసీ సభ్యులు, నస్పూర్ పట్టణ ఇన్‌చార్జి నూకల రమేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలి




మంచిర్యాల,ఆగస్టు 24, జనగణమన ప్రతినిధి ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న అల్పాహారం పోషక విలువలతో సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల కేంద్రీకృత వంటశాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఈ క్రమంలో హరే కృష్ణ ఫౌండేషన్ వారు కార్యక్రమం నిర్వహణకు ముందుకు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ఉదయం వేళలో పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, ఏకాగ్రత, విద్యాభ్యాసానికి తోడ్పడుతుందని తెలిపారు. అనంతరం ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు 23.75 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేస్తున్న క్రిటికల్ కేర్ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజల సంక్షేమంలో భాగంగా చేపట్టిన పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రావణ సోమవారం.. కేతకీ సంగమేశ్వరుడి సన్నిధిలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ఝరాసంగం ఆలయంలో ప్రత్యేక పూజలు**

**రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, ఆరోగ్యం కోసం ప్రార్థన**

**దర్శనం అనంతరం స్థానిక నాయకులతో ఆత్మీయ ముచ్చట**



జనగణమన ప్రతినిధి యాదాద్రి భువనగిరి జిల్లా। ఆగస్టు 24:శ్రావణ మాస సోమవారం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సంగారెడ్డి జిల్లా ఝరాసంగంలోని ప్రసిద్ధ శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామివారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామివారిని దర్శించుకున్న బీర్ల ఐలయ్య భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించారు.శ్రావణ సోమవారం కావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయ విశిష్టతను, భక్తుల సౌకర్యాలకు సంబంధించిన అంశాలను కూడా స్థానికులతో చర్చించారు.దర్శనం అనంతరం బీర్ల ఐలయ్య స్థానిక నాయకులతో కలిసి కొద్దిసేపు గడిపారు. టీ, కాఫీ సేవిస్తూ వారితో ఆత్మీయంగా ముచ్చటించి స్థానిక అంశాలపై మాట్లాడారు. ప్రజలు, నాయకులతో ఆయన సాదాసీదాగా కలిసిమెలిసి మాట్లాడటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బీసీ యువత అధ్యక్షుడు గౌరుగంటి రమేష్ కుమార్, ఆందోల్ మాజీ మున్సిపల్ చైర్మన్‌తో పాటు పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.ఫొటో క్యాప్షన్: శ్రావణ సోమవారం సందర్భంగా ఝరాసంగం శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య.

# ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

**రూ.15 వేల లంచం తీసుకుంటుండగా జీపీవో, ఆర్ఐ పట్టివేత**

**8 ఎకరాల భూమి పౌతి కోసం లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణ**



జనగణమన ప్రతినిధి యాదాద్రి భువనగిరి జిల్లా। ఆగస్టు 24: ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దాడులు నిర్వహించారు. భూమి పౌతి ప్రక్రియకు సంబంధించి రూ.15 వేల లంచం తీసుకుంటుండగా జీపీవో అహ్మద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) పూర్ణచంద్రరావును ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం.ఆలేరు మండలం కొలనుపాక రెవెన్యూ పరిధిలోని ధర్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బుడిగె మహేష్ తన తండ్రికి చెందిన 8 ఎకరాల భూమిని పౌతి చేయించేందుకు రెవెన్యూ అధికారులను సంప్రదించినట్లు తెలిసింది.ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు జీపీవో అహ్మద్, ఆర్ఐ పూర్ణచంద్రరావు మొదట రూ.20 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంత మొత్తం తాను ఇవ్వలేనని మహేష్ చెప్పగా, డబ్బులు ఇవ్వకపోతే భూమి పౌతి చేయడం సాధ్యం కాదని చెప్పినట్లు సమాచారం. అనంతరం కనీసం రూ.15 వేలు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేసినట్లు ఆరోపిస్తున్నారు.దీంతో లంచం ఇవ్వడానికి ఇష్టపడని మహేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించి శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఫిర్యాదు ఆధారంగా రెండు రోజుల పాటు నిఘా పెట్టిన ఏసీబీ అధికారులు పక్కా సమాచారంతో సోమవారం ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో వల పన్నారు.ఈ క్రమంలో రూ.15 వేల లంచం స్వీకరణకు సంబంధించి జీపీవో, ఆర్ఐలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం.అనంతరం జీపీవో అహ్మద్, ఆర్ఐ పూర్ణచంద్రరావును తదుపరి విచారణ నిమిత్తం ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు జరగడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, తదుపరి చట్టపరమైన చర్యలు తెలియాల్సి ఉంది.ఆరోపణలపై ఏసీబీ విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో తుది నిర్ధారణ అధికారిక దర్యాప్తునకు లోబడి ఉంటుంది.

# 16 వా వార్డులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



ఆసిఫాబాద్, జనగణమన ప్రతినిధి ఆసిఫాబాద్ పట్టణంలోని 16వ వార్డులో లబ్ధిదారులకు సోమవారం ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎం.డి. అహ్మద్ , కౌన్సిలర్ దూడల లక్ష్మి, తో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ కార్డుల లబ్ధిదారులకు ప్రభుత్వం మరింత సులభంగా, పారదర్శకంగా సేవలు అందించేందుకు ఈ స్మార్ట్ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులందరికీ కార్డులు అందజేస్తున్నామని, ఇంకా తీసుకోని వారు వెంటనే తమ పరిధిలోని రేషన్ డీలర్‌ను సంప్రదించి స్మార్ట్ రేషన్ కార్డులను పొందాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది అభిషేక్ , రేషన్ డీలర్ శ్రీను, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# చరమాంకంలోనూ ఉరుకులు పరుగులు!

**ప్రపంచీకరణ మనుషులను ముందుగా వినియోగదారులుగా మార్చింది. ఆ తర్వాత వారినే మార్కెట్‌లో నిత్యం వినిమయ వస్తువులుగా నిలిపింది. బతకడానికి నిరంతరం పరుగులు తీయాల్సిందేననే పరిస్థితిని సృష్టించింది. విశ్రాంతి తీసుకునే వయసులోనూ ఉపాధి కోసం శ్రమించాల్సి వస్తోంది. ఒకప్పుడు ఉద్యోగ విరమణ అంటే జీవితానికి విరామమని భావించేవారు. ఇప్పుడు మాత్రం రిటైర్ అయిన తర్వాతే మరో పోరాటం మొదలవుతోంది. పిల్లలపై ఆధారపడకుండా, అప్పుల భారాన్ని మోస్తూ, కుటుంబ బాధ్యతలను నెరవేర్చడానికి అరవై, డెబ్బై ఏళ్ల వయసులోనూ వేలాది మంది సీనియర్ సిటిజన్లు గిగ్ ఎకానమీలో భాగమవుతున్నారు. ఉబెర్ ఆటోలు నడుపుతూ, అమెజాన్ పార్సిళ్లు పంపిణీ చేస్తూ బతుకు తెరువు కోసం పాట్లు పడుతున్నారు.**



బెంగళూరుకు చెందిన యాభై ఆరేళ్ల రేష్మ దుస్తుల తయారీ కంపెనీలో షర్టులు కుట్టేది. రోజుకు వెయ్యి రూపాయలు సంపాదించేది. కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో ఆ కంపెనీ మూతపడటంతో ఆమెకు పని లేకుండా పోయింది. కుటుంబాన్ని పోషించడానికి అమెజాన్‌లో చేరి పార్సిళ్లు డెలివరీ చేసేది. గతంలో ఆమెకు క్యాన్సర్ సోకింది. చికిత్స తీసుకుని మళ్లీ పని ప్రారంభించింది. ఈ క్రమంలోనే మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆమె కొడుకుకు మూత్రపిండాలు పనిచేయడం మానేశాయి. వైద్యం కోసం ఏడు లక్షల రూపాయలు ఖర్చు పెట్టినా ఫలితం లేకపోయింది. అతను మరణించాడు. మరోవైపు పెళ్లీడుకొచ్చిన కూతురు ఉంది. ఆమె పెళ్లి కోసం మైక్రోఫైనాన్స్ కంపెనీల నుంచి రూ.7–8 లక్షలు అప్పు తీసుకుంది. ప్రస్తుతం రోజుకు రూ.700 సంపాదిస్తున్న రేష్మకు ఇంటి అవసరాలు, అప్పులు, కూతురు పెళ్లి ఖర్చులు తీరడం కష్టంగా మారింది. ''అప్పు చేసి నా కూతురికి చెవి పోగులు కొన్నా. వాటికి వడ్డీ పెరిగిపోయింది. చెల్లించలేకపోతున్నాను. ఆ పోగులను తిరిగి ఇచ్చేసే పరిస్థితి వచ్చింది'' అని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. కొడుకు చనిపోయిన తర్వాత ఆమె భర్త మద్యానికి బానిసయ్యాడు. ఏ పని చేయకుండా, తాను కూడబెట్టిన కొద్దిపాటి డబ్బును సైతం మద్యానికే ఖర్చు చేస్తున్నాడని రేష్మ చెప్పింది. క్యాన్సర్, కరోనా మహమ్మారిని ఎదుర్కొన్నా, జీవితంలోని కష్టాలను మాత్రం ఎదుర్కోలేకపోతున్నానని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

### ఆగని జీవనపోరాటం

61 ఏళ్ల సురేశ్‌కుమార్ 1993లో కోలార్ నుంచి బెంగళూరుకు వచ్చాడు. చిన్నతనంలోనే తండ్రి చనిపోవడంతో కుటుంబ బాధ్యతలు అతనిపైనే పడ్డాయి. తండ్రి వ్యాపారంలో వచ్చిన నష్టంతో మిగిలిన అప్పులను తీర్చడానికి చదువును మధ్యలోనే ఆపేశాడు. ఆటో కొనుక్కొని నడుపుతూ ముగ్గురు చెల్లెళ్ల చదువులు, పెళ్లిళ్లు చేశాడు. 40 ఏళ్ల వయసులో పెళ్లి చేసుకున్నాడు. పెద్ద కూతురు ప్రైవేటు పాఠశాలలో చేరినప్పుడు యూనిఫాం, పుస్తకాలకు కూడా డబ్బు లేకపోవడంతో విద్యా హక్కు చట్టంపై అధ్యయనం చేశాడు. 'చైల్డ్ రైట్స్ ట్రస్ట్' నిర్వహించిన సమావేశాలకు హాజరై చట్టాన్ని తెలుసుకున్నాడు. ప్రైవేటు పాఠశాలల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించాడు. అతనికి మద్దతుగా తల్లిదండ్రులు నిలిచారు. ''విద్యా హక్కు చట్టం గురించి తెలుసుకోవాలంటే సురేశ్‌కుమార్‌ను సంప్రదించండి'' అంటూ ఆటో డ్రైవర్లు తమ ఆటోలపై బ్యానర్లు కట్టి ప్రచారం చేశారు. ప్రయివేటు విద్యాసంస్థల ఫిర్యాదుతో పోలీసులు అతడిని అరెస్టు చేయగా, రెండు రోజులు జైలులో ఉన్నాడు. ఆ సమయంలో మీడియా తనకు అండగా నిలిచిందని అతను తెలిపాడు. ప్రస్తుతం బెంగళూరు ఆటోరిక్షా డ్రైవర్ల యూనియన్‌కు నాయకత్వం వహిస్తున్నాడు. పెద్ద కుమార్తె ఇంటర్‌లో 91 శాతం మార్కులు సాధించగా, చిన్న కుమార్తె మెరిట్ స్కాలర్‌షిప్‌పై చదువుతోంది. అయినా వారి చదువులు, ఇంటి అవసరాల కోసం ఈ వయసులోనూ ఆటో నడుపుతున్నాడు.

మరో ఆటో డ్రైవర్ రంగస్వామి చిన్నపాటి ఉద్యోగం చేసేవాడు. రిటైర్‌మెంట్ తర్వాత అప్పులు తీర్చడానికి 66 ఏళ్ల వయసులో ఆటో నడుపుతున్నాడు. ''కుటుంబ అవసరాల కోసం మైక్రోఫైనాన్స్ కంపెనీ వద్ద లక్షన్నర రూపాయలు అప్పు తీసుకున్నాను. ఈఎంఐల కోసం నెలకు రూ.7,500 కట్టాలి. తిండి, ఇంటి అద్దె, మందుల ఖర్చులు... వీటన్నింటినీ భరించడానికి నేను కష్టపడుతున్నాను. పిల్లలకు పెళ్లిళ్లు అయ్యాయి. వారి ఖర్చులు వారికుంటాయి. మా బాధ్యతలు వారికెందుకు? అందుకే నా భార్య, నేను విడిగా ఉంటూ అప్పులు తీర్చుకుంటున్నాం'' అని అతను చెప్పాడు. యాప్ ఆధారిత విధానంలో పనిచేస్తున్న వీరి శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడం లేదు. రోజుకు 12 నుంచి 14 గంటలు పనిచేసే డ్రైవర్ నెలకు రూ.50 వేలు సంపాదించినా, కమిషన్, ఇంధనం, బీమా, నిర్వహణ ఖర్చులు, వాహన ఈఎంఐలు చెల్లించిన తర్వాత చేతికి సుమారు రూ.10 వేలు మాత్రమే మిగులుతుందని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్-బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు ఇనాయత్ అలీ తెలిపాడు.

### భద్రత లేని శ్రమ

మన దేశ శ్రామికశక్తిలో గిగ్ వర్కర్ల వాటా ప్రస్తుతం 2 శాతానికి పైగా ఉంది. ప్రభుత్వ అంచనాల ప్రకారం దేశవ్యాప్తంగా 1.2 కోట్ల మంది గిగ్ వర్కర్లు ఉన్నారు. రాబోయే దశాబ్దంలో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. వయసు పైబడిన తర్వాత కూడా జీవనోపాధి కోసం శ్రమించాల్సి రావడం వ్యక్తిగత సమస్యగా చూడలేం. జీవితం చివరి దశలోనూ ఆదాయం కోసం పరుగులు పెట్టాల్సిన పరిస్థితి మన ఆర్థిక వ్యవస్థలోని అసమానతలను, సామాజిక భద్రత లోపాన్ని వెల్లడిస్తోంది. ప్రపంచీకరణ, సాంకేతికత, గిగ్ ఎకానమీ పేరుతో అవకాశాలు పెరిగాయని చెబుతున్నా, ఆ అవకాశాల వెనుక శ్రమించే మనుషులకు కనీస భద్రత లేకపోతే ఆ అభివృద్ధికి అర్థం ఏమిటన్నది ప్రశ్న. అభివృద్ధి అంటే మనుషులను జీవితాంతం పరుగులు పెట్టించడం కాదు.. వారు ఒక దశలో ప్రశాంతంగా, గౌరవంగా జీవించే పరిస్థితులను కల్పించడమే నిజమైన అభివృద్ధి.


రంగస్వామి

# ఎడమామె అంటే ఏంటో తెలుసా.. ఆరోగ్యానికి ఇది ఎంతలా ఉపయోగపడుతుందంటే..

ఎడమామె సాధారణ స్నాక్‌లకు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది. ఇందులో ప్రోటీన్, ఫైబర్ వంటి ముఖ్యమైన పోషకాలు ఉండటంతోపాటు, ఎక్కువసేపు కడుపు నిండిన



భావన కలిగిస్తుంది. అందుకే వారానికి కొన్ని సార్లు ఎడమామెను ఆహారంలో భాగంగా చేర్చుకోవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ఎడమామెలో అధిక నాణ్యత కలిగిన ప్రోటీన్ ఉంటుంది. శరీరానికి అవసరమైన తొమ్మిది ఎసెన్షియల్ అమైనో ఆమ్లాలు ఇందులో లభిస్తాయి. ముఖ్యంగా శాకాహారం తీసుకునే వారికి మొక్కల ఆధారిత ప్రోటీన్‌కు ఇది మంచి వనరుగా ఉపయోగపడుతుంది. రోజువారీ ఆహారంలో తగినంత ప్రోటీన్ అందుకోవడానికి ఎడమామెను స్నాక్‌గా లేదా భోజనంలో భాగంగా తీసుకోవచ్చు.

**ఫైబర్ అధికం..**

ఎడమామెలో ఫైబర్ కూడా సమృద్ధిగా ఉంటుంది. ఒక కప్పు ఎడమామెలో సుమారు 8–9 గ్రాముల ఫైబర్ లభిస్తుంది. ఇది జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి, పేగుల్లోని మంచి బ్యాక్టీరియా సమతుల్యతను కాపాడుకోవడానికి సహాయపడుతుంది. అలాగే మలబద్ధకం సమస్యను తగ్గించడంలో కూడా ఫైబర్ ఉపయోగపడుతుంది. ఎడమామెకు గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. అందువల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా ఉండేందుకు ఇది సహాయపడుతుంది. ముఖ్యంగా పీసీవోఎస్ (రాజూరా) లేదా మధుమేహం ఉన్నవారు తమ ఆహారంలో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగిన ఆహారాలను చేర్చుకోవడం ద్వారా రక్తంలో చక్కెర నియంత్రణకు తోడ్పడుతుంది.

**ఆకలి నియంత్రణకు..త**

ఎడమామె కడుపు నిండిన భావనను ఎక్కువసేపు కొనసాగించడంలో కూడా సహాయపడుతుంది. దీంతో తరచూ ఆకలి వేయడం లేదా అనారోగ్యకరమైన స్నాక్స్ తినాలనే కోరికను తగ్గించుకోవచ్చు. బరువు నియంత్రించుకోవాలనుకునేవారు చిప్స్, ఇతర జంక్ ఫుడ్స్‌కు బదులుగా ఎడమామెను ఆరోగ్యకరమైన స్నాక్‌గా ఎంచుకోవచ్చు. వ్యాయామం చేసే వారికి కూడా ఎడమామె మంచి స్నాక్‌గా ఉపయోగపడుతుంది. ప్రోటీన్, ఫైబర్ అందించే కారణంగా వర్కౌట్ తర్వాత లేదా రెండు భోజనాల మధ్యలో తీసుకోవచ్చు. వారానికి రెండు నుంచి మూడు సార్లు ఎడమామెను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన, పోషక విలువలు కలిగిన స్నాక్‌ను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

# నడక, శ్వాస.. కలగలిసి...

తాయ్ చి' అనేది చైనీస్ యుద్ధ కళ. దీని సూత్రాల ఆధారంగా చేసే మైండ్‌ఫుల్ నడక 'తాయ్ చి వాకింగ్'. చాలా నెమ్మదిగా, ప్రతీ అడుగునూ గమనిస్తూ నడవడం దీని ప్రత్యేకత. ఇందులో శ్వాస, సమతుల్యత, శరీరంపై పూర్తి స్పృహ ముఖ్యం. ఎక్కడైనా, ఎవరైనా వయసుతో సంబంధం లేకుండా దీనిని సాధన చేయొచ్చు. సరళంగా ఉంటూనే ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు ఇస్తోందని, ఒత్తిడితో బాధపడేవారు దీనికి ఆకర్షితులవుతున్నారు. సాధన చేస్తున్నారు. ఒత్తిడికి గురైనప్పుడు కాసేపు వాకింగ్ చేయాలని పెద్దలు సూచిస్తుంటారు. ఇంటి చుట్టూ చిన్న నడక కావొచ్చు, దగ్గర్లోని పార్కుకు వెళ్లి ప్రశాంతంగా వాకింగ్ చేయడం కావొచ్చు. మొత్తమ్మీద నడక వల్ల ఎన్నో ప్రయోజనాలుంటాయని తాయ్ చి ట్రెండ్ చాటుతోంది. "రోజంతా స్క్రీన్ ముందే ఉండటం వల్ల విపరీతమైన మెడ, నడుము నొప్పులుండేవి. దీంతో తాయ్ చి నడక ట్రై చేశా. రోజూ సాయంత్రం 15–20 నిమిషాలు శ్వాసపై దృష్టిపెడుతూ చేసే ఈ నడక నా మైండ్‌ను రిఫ్రెష్ చేస్తోంది. రాత్రివేళల్లో నిద్ర కూడా బాగా పడుతోంది" అంటూ ఐటీ ఉద్యోగులు తమ అనుభవాలను సోషల్‌మీడియాలో పంచుకుంటున్నారు.




**ఇదీ నడిచే విధానం...**

'తాయ్ చి వాకింగ్' సాధారణ నడకలాంటిది కాదు... దీనికి కొన్ని పద్ధతులున్నాయి. అడుగు వేసేటప్పుడు ముందుగా మడమను (హీల్) నేలపై మోపి, తర్వాత నెమ్మదిగా పాదాన్ని నేలకు ఆన్చాలి. ఇక కాలుపై శరీరపు బరువును పూర్తిగా మోపాకే మరో కాలును ముందుకు వేయాలి. వెన్నెముక తిన్నగా ఉంచి, చేతులను స్వేచ్ఛగా ఊపుతూ శ్వాసపై దృష్టి పెట్టాలి. ఈ విధానంలో నెమ్మదిగా, ఉద్దేశపూర్వకంగా కదులుతూ బరువును పూర్తిగా ఒక కాలు నుంచి మరో కాలుకు ఎలా బదిలీ చేయాలో నేర్చుకుంటారు. అంటే 'బరువైన పాదం, తేలికైన పాదం' అవగాహన దీనిలో ముఖ్యం. "మీ బరువును మోసే బరువైన పాదానికీ, స్వేచ్ఛగా కదలగలిగే తేలికైన పాదానికీ మధ్య ఉన్న స్పష్టమైన వ్యత్యాసాన్ని గమనిస్తూ నెమ్మదిగా నడక కొనసాగించాలి" అంటారు తాయ్ చి మాస్టర్, 'ద ఫైవ్ సీజన్స్ మెథడ్' రచయిత్రీ లెడా ఇలియట్. "మనం ప్రతీ అడుగునూ అవగాహనతో, ఉద్దేశపూర్వకంగా వేసినప్పుడు అర్థవంతమైన మార్గాన్ని సృష్టించుకుంటాం. ఈ విధంగా తాయ్ చి నడక మన జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. ఇది సురక్షితమైనదే. అయితే ప్రారంభ దశలో ఉన్నవారు ఒకేసారి ఎక్కువగా చేయకుండా జాగ్రత్త తీసుకోవాలి" అని సూచిస్తారామె.




# వివాదంతో పెద్ద ప్రచారం కొట్టేసిన వర్ధమాన నటి

అయితే ఇటీవల కన్నప్ప, బ్లాస్ట్ చిత్రాల ద్వారా ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న వర్ధమాన నటి ప్రీతి ముకుందన్ పాల్గొన్న ఓ ప్రచార కార్యక్రమం తీవ్ర విమర్శలకు దారితీసింది సినిమా ప్రమోషన్లలో వినూత్న పద్ధతులు పాటించడం ఈ రోజుల్లో సర్వసాధారణమైపోయింది. అయితే ఇటీవల కన్నప్ప, బ్లాస్ట్ చిత్రాల ద్వారా ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న వర్ధమాన నటి ప్రీతి ముకుందన్ పాల్గొన్న ఓ ప్రచార కార్యక్రమం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఓ పబ్లిక్ ఈవెంట్‌లో పాల్గొనడానికి ఆమెను గ్రాండ్‌గా రథంపై ఊరేగింపుగా తీసుకెళ్లడం పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈ ఊరేగింపు సందర్భంగా అందాల భామను ప్రత్యక్షంగా చూసేందుకు అభిమానులు, జనం భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోయి సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో నెటిజన్లు మండిపడ్డారు. పబ్లిసిటీ స్టంట్ల పేరుతో ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందంటూ పలువురు హితవు పలికారు. తర్వాత ఆగని 5 సినిమాలు ఇదే సమయంలో ప్రీతి ముకుందన్ కుటుంబ నేపథ్యం గురించి కూడా నెట్టింట ఒక ఆసక్తికరమైన ప్రచారం సాగుతోంది. భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్‌కు ఈ నటి మనవరాలు (గ్రాండ్ డాటర్) అంటూ వార్తలు వస్తున్నాయి. అయితే ఇందులో నిజం లేదని.. రామానుజన్ 1920లో తన 32వ ఏటనే సంతానం లేకుండా పరమపదించారని.. కాబట్టి ఆయనకు నేరుగా వారసులు ఎవరూ లేరని స్పష్టమవుతోంది. నెటిజన్లు అనుకుంటున్నట్లు రామానుజన్‌కు ప్రీతి ప్రత్యక్ష మనవరాలు కాకపోయినా ఆమె ఆయన కుటుంబానికి చెందిన వ్యక్తి కావడం విశేషం. ప్రీతి ముకుందన్‌కు రామానుజన్ వరుసకు ముత్తాత (గ్రేట్-గ్రాండ్ అంకుల్) అవుతారు.



రామానుజన్ తమ్ముడి కుమారుడే అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన కర్నాటిక్ జాజ్ గిటారిస్ట్ గిటార్ ప్రసన్న (ప్రసన్న రామస్వామి) .. ఆయన సోదరి డాక్టర్ దీపా ముకుందన్. ఈ డాక్టర్ దీపా ముకుందన్ మరెవరో కాదు, హీరోయిన్ ప్రీతి ముకుందన్ తల్లే. అంటే గిటార్ ప్రసన్నకు ప్రీతి మేనకోడలు కాగా.. శ్రీనివాస రామానుజన్ ఆమెకు తల్లి తరఫు నుంచి ముత్తాత వరుస అవుతారు. సోషల్ మీడియాలో కుటుంబ వృక్షాన్ని కాస్త అటూ ఇటూగా ప్రచారం చేసినా ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఒక గొప్ప గణిత శాస్త్రవేత్త రక్తం తన నరాల్లో కూడా ప్రవహిస్తోందని తెలిసి ప్రీతి ఫ్యాన్స్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ట్రాఫిక్ వివాదం.. మరోవైపు ఈ అరుదైన ఫ్యామిలీ కనెక్షన్‌తో ప్రీతి ముకుందన్ పేరు ప్రస్తుతం ఫిలిం వర్గాల్లో తెగ మారుమోగిపోతోంది.

# దిల్ రాజు 'టాక్సిక్' రిస్క్.. మామూలు టాక్ సరిపోదు!

యష్‌కు తెలుగు మార్కెట్ 'కేజీఎఫ్'తోనే మొదలైంది. అప్పట్లో ఆ సినిమా తెలుగు హక్కుల విలువ దాదాపు రూ.5 కోట్లుగా ఉండగా, ఫుల్ రన్‌లో ఏపీ తెలంగాణ నుంచి సుమారు రూ.12.3 కోట్ల షేర్ వచ్చింది. యష్‌కు తెలుగు మార్కెట్ 'కేజీఎఫ్'తోనే మొదలైంది. అప్పట్లో ఆ సినిమా తెలుగు హక్కుల విలువ దాదాపు రూ.5 కోట్లుగా ఉండగా, ఫుల్ రన్‌లో ఏపీ తెలంగాణ నుంచి సుమారు రూ.12.3 కోట్ల షేర్ వచ్చింది. వారాహి వాళ్ళు చిన్న రేటుకు తీసుకున్న సినిమా డబుల్‌కు పైగా రిటర్న్ ఇవ్వడంతో యష్‌కు ఇక్కడ మంచి బేస్



పడింది. ఆ తర్వాత 'కేజీఎఫ్ 2' వచ్చేసరికి ఆ లెక్క పూర్తిగా మారిపోయింది. దిల్ రాజు తోనే 'కేజీఎఫ్ 2' తెలుగు రాష్ట్రాల్లో ఏకంగా రూ.80 కోట్లకు పైగా షేర్ తెచ్చింది. వేర్వేరు ట్రేడ్ లెక్కల్లో రూ.83 నుంచి రూ.86 కోట్ల మధ్య ఫైనల్ షేర్ కనిపిస్తోంది. ఒక్క నైజాంలోనే రూ.40 కోట్లకు పైగా వచ్చింది. అంటే మొదటి 'కేజీఎఫ్'తో మొదలైన మార్కెట్ రెండో పార్ట్ దగ్గరకు వచ్చేసరికి మరో రేంజ్‌కు వెళ్లిపోయింది. ఇప్పుడు 'టాక్సిక్' విషయంలో దిల్ రాజు తీసుకున్న నిర్ణయం అక్కడే పెద్దదిగా కనిపిస్తోంది. ఏపీ తెలంగాణ హక్కుల కోసం రూ.100 కోట్లకు పైగా పెట్టినట్లు ట్రేడ్‌లో బలమైన టాక్ ఉంది. కొన్ని రిపోర్ట్స్ రూ.120 కోట్ల వరకూ చెబుతున్నాయి. అయితే ఫైనల్ డీల్ నెంబర్‌పై వేర్వేరు లెక్కలు తిరుగుతున్నాయి. ఇక్కడ సమస్య ఒక్కటే. 'కేజీఎఫ్ 2'కు మొదటి పార్ట్ ఇచ్చిన హైప్ ఉంది. రాకీ భాయ్ క్యారెక్టర్‌కు ఇప్పటికే భారీ క్రేజ్ ఉంది. 'టాక్సిక్' మాత్రం పూర్తిగా కొత్త కథ. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం, 'ఏ' సర్టిఫికెట్, బోల్డ్ కంటెంట్.. ఇవన్నీ కలిపి ఈ సినిమా మరో జోన్‌లో ఉంది. అంటే ఓపెనింగ్స్ గట్టిగా వచ్చినా, పెట్టిన రేటు రికవర్ కావాలంటే రెండో రోజు నుంచి కూడా టాక్ అలాగే పని చేయాలి. 'కేజీఎఫ్ 2' తెలుగు రాష్ట్రాల్లో రూ.80 కోట్లకు పైగా షేర్ తెచ్చింది. ఇప్పుడు 'టాక్సిక్' హక్కుల విలువ నిజంగానే రూ.100 కోట్లకు పైగా ఉంటే, యష్ గత సినిమాను దాటడం మాత్రమే సరిపోదు. కనీసం రూ.100 కోట్ల షేర్ రేంజ్‌కి వెళ్లే రన్ కావాలి. అంటే గ్రాస్ లెక్క ఇంకా చాలా పెద్దది కావాలి. అందుకే దిల్ రాజు ఈసారి యష్ మీద పెట్టింది చిన్న బెట్ కాదు. 'కేజీఎఫ్' సమయంలో రూ.5 కోట్ల మార్కెట్ నుంచి మొదలైన నెంబర్ ఇప్పుడు రూ.100 కోట్లకు పైగా రైట్స్ వరకు వచ్చింది. 'టాక్సిక్'కు మామూలు పాజిటివ్ టాక్ వచ్చి మంచి ఓపెనింగ్‌తో ఆగిపోతే సరిపోదు. తెలుగు రాష్ట్రాల్లో లాంగ్ రన్ పడాలి. అప్పుడే దిల్ రాజు పెట్టిన ఈ పెద్ద లెక్క నిజంగా వర్కవుట్ అవుతుంది.

# ఇరుముడి: మూడవ రోజు కూడా భారీ కలెక్షన్స్ !



బలమైన కథాంశం ఉన్న సినిమాను ప్రేక్షకులు అసాధారణ స్థాయికి తీసుకెళ్తారని రవితేజ 'ఇరుముడి' మరోసారి నిరూపించింది. ఈ సినిమాలోని భావోద్వేగభరితమైన కథనం ప్రేక్షకులను బలంగా ఆకట్టుకుంది. దీనికి తోడు ప్రేక్షకుల నుంచి వస్తున్న సానుకూల స్పందన కారణంగా కలెక్షన్స్ భారీగా వస్తున్నాయి. బుక్‌మైషోలో మూడవ రోజు (ఆదివారం) నాడు ఏకంగా 4 లక్షలకు పైగా టిక్కెట్లు అమ్ముడయ్యాయి. రెండు విజయవంతమైన రోజుల తర్వాత కూడా ప్రేక్షకుల నుంచి బలమైన స్పందన లభిస్తోంది. పైగా తెలుగు రాష్ట్రాల్లోని చాలా షోలు హౌస్‌ఫుల్ అయ్యాయి. ఈ చిత్రం ఇప్పటికే రెండు రోజుల్లో సుమారు రూ. 50 కోట్లు వసూలు చేసింది. బుకింగ్‌లు, ప్రేక్షకుల స్పందన అద్భుతంగా ఉండటంతో మూడవ రోజు కూడా భారీ వసూళ్లను సాధించింది. ఇప్పటివరకు బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ ప్లాట్‌ఫామ్‌లలో 25 లక్షలకు పైగా టిక్కెట్లు అమ్ముడయ్యాయి. సోమవారం బుకింగ్‌లలో కూడా బలమైన డిమాండ్ కనిపిస్తోంది. మొత్తానికి ఈ ఫ్యామిలీ థ్రిల్లర్ డ్రామా మూవీకి ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ సినిమాలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటించగా మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేశారు.

# బన్నీ 'రాకా' పై మరో క్రేజీ రూమర్ ?




'ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ' కలయికలో రాబోతున్న సినిమా 'రాకా'. ఐతే, ఈ సినిమాలో ఐశ్వర్య లక్ష్మి ఓ పాత్రలో కనిపిస్తోందట. ఐతే, ఆమెది హీరోయిన్ పాత్ర కాదు అని, ఓ నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో ఐశ్వర్య లక్ష్మి నటిస్తోందని తెలుస్తోంది. ఆమె పాత్రకు సంబంధించిన వివరాలు మాత్రం ఇంకా తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ముంబైలో ఈ చిత్ర షూటింగ్ జరుగుతోంది. ఈ షూట్ లో ఐశ్వర్య లక్ష్మి కూడా జాయిన్ అవుతుందట. కాగా ఈ సినిమాలో యాక్షన్ అద్భుతంగా ఉంటుందట. ఈ మూవీలో దీపికా పడుకోణె హీరోయిన్ గా నటిస్తోన్న సంగతి తెలిసిందే. అన్నట్టు ఈ సినిమాలో దీపికా పడుకోణెతో పాటు మృణాల్ ఠాకూర్ కూడా హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే, జాన్వీ కపూర్ కూడా మరో హీరోయిన్ గా నటిస్తోంది. కాగా మాఫియా బ్యాక్ డ్రాప్ లో ఓ డాన్ చుట్టూ ఈ కథా నేపథ్యం సాగుతుందట. అన్నట్టు సన్ పిక్చర్స్ వారు ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్ పై తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం అంతర్జాతీయ స్థాయి టెక్నీషియన్స్ పనిచేస్తున్నారు.

# నిత్యామీనన్ పెళ్లికి ఒకే చెప్పిందా?

దక్షిణాది చిత్ర పరిశ్రమలో అద్భుతమైన నటనతో, ప్రత్యేకమైన అభినయంతో కోట్లాదిమంది హృదయాలను గెలుచుకున్న నటి నిత్యామీనన్ గురించి ఓ ఆసక్తికర వార్త హాట్ టాపిక్‌గా మారింది. దక్షిణాది చిత్ర పరిశ్రమలో అద్భుతమైన నటనతో, ప్రత్యేకమైన అభినయంతో కోట్లాదిమంది హృదయాలను గెలుచుకున్న నటి నిత్యామీనన్ గురించి ఓ ఆసక్తికర వార్త హాట్ టాపిక్‌గా మారింది. విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ నటిగా ఎప్పుడూ ముందుండే అమ్మడు వ్యక్తిగత జీవితంపై తరచూ రకరకాల ఊహాగానాలు వస్తుంటాయి. తాజాగా 35 ఏళ్ల టాలెంటెడ్ బ్యూటీ ఎట్టకేలకు పెళ్లికి గ్రీన్ సిగ్నెల్ ఇచ్చిందని నెట్టింట జోరుగా ప్రచారం సాగుతోంది. ఇటీవల కాలంలో నిత్యామీనన్ పెళ్లికి సంబంధించిన విషయాలపై పలు రకాల చర్చలు జరుగుతున్నా? ఆమె కుటుంబ సభ్యుల నుంచి అందిన



సంకేతాల మేరకు వివాహానికి అంగీకరించినట్లు తెలుస్తోంది. ఇంతకాలం సినిమాలతో బిజీగా ఉన్ననిత్యామీనన్ వ్యక్తిగత జీవితంలో కొత్త అడుగు వేయాలని నిర్ణయించు కున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నిత్యామీనన్ తల్లిదండ్రులు తగిన జోడీని వెతికే పనిలో పడ్డట్లు ప్రచారం జోరందుకుంది. కులమతాల కంటే మంచి మనసు, అండర్‌స్టాండింగ్ ఉన్న వ్యక్తి అయితే చాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యులు ఎంపిక ప్రక్రియను ప్రారంభించినట్లు సమాచారం. నిత్యామీనన్ విషయంలో ఇంతవరకూ పెద్దగా పుకార్లు కూడా లేవు. ఫలానా హీరోతో లవ్ లో ఉందంట? డేటింగ్ చేస్తుందనే కథనాలు అమ్మడి కెరీర్ లో ఇంత వరకూ లేవు. అలాగని ప్రేమకు...డేటింగ్ కు వ్యతిరేకం అని ఎన్నడు ప్రకటించలేదు. ఇంకా చెప్పాలంటే పెద్దలు చూసిన కుర్రాడిని చేసుకోవడం కంటే జీవిత భాగస్వామిని మనసుకు నచ్చిన వాడిని స్వయంగా ఎవరికి వారు వెతుక్కోవడం... ఆ తర్వాత కొంత కాలం పాటు కలిసి ఉండటం...అభిప్రాయాలు మ్యాచ్ అయితే కలిసి ఉండటం లేకపోతే విడిపోవడం అనే విధానానికే నిత్యామీనన్ గతంలో ఓటు వేసారు. కానీ అమ్మడి కెరీర్ లో మాత్రం ఇప్పుడు అందుకు భిన్నంగా సన్నివేశం కనిపిస్తుంది. కుర్రాడిని నిత్యా మీనన్ ఎంపిక చేసుకున ఛాన్స్ తీసుకోకుండా ఆ బాధ్యతల్ని తల్లిదండ్రులుకు అప్పగించినట్లు కనిపిస్తుంది. నిత్య సినిమాల విషయానికి వస్తే గ్లామర్ పాత్రల కంటే కథా బలమున్న పాత్రలకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. -తిరుచిత్రబలం- వంటి చిత్రాలతో తన నటనతో నేషనల్ అవార్డును సొంతం చేసుకున్న నిత్య తనకంటూ ప్రత్యేకమైన సినీ ప్రయా ణాన్ని ఏర్పరుచుకున్నారు. అలాగే పలు టీవీ షోలకు హోస్ట్ గాను బాధ్యతలు వహించి అక్కడా సత్తా చాటుతున్నారు. ప్రస్తుతం ఈ ప్రచారం టాలీవుడ్ – కోలీవుడ్ లో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందనేది అధికారిక ప్రకటన వచ్చే వరకు క్లారిటీ రాదు

# ట్రెడిషనల్ చీరలో కుమారి గ్లామర్ టచ్.. ఫ్యాన్స్ ఫిదా!



టాలీవుడ్‌లో కుమారి 21ఎఫ్' సినిమాతో కుర్రకారు గుండెల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హెబ్బా పటేల్, తాజాగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన శారీ పిక్స్‌తో రచ్చ చేస్తోంది. టాలీవుడ్‌లో కుమారి 21ఎఫ్' సినిమాతో కుర్రకారు గుండెల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హెబ్బా పటేల్, తాజాగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన శారీ పిక్స్‌తో రచ్చ చేస్తోంది. ఎప్పుడూ గ్లామరస్ అవుట్‌ఫిట్లలో కనిపించే ఈ ముద్దుగుమ్మ, ఈసారి సాంప్రదాయ ముకైష్ వర్క్ అండ్ టిష్యూ సిల్క్ చీరలో కనిపించి అందరినీ ఆకట్టుకుంది. మోడరన్ గ్లామర్‌కు ట్రెడిషనల్ లుక్‌ను జోడించి ఆమె ఇచ్చిన ఫోజులు ప్రస్తుతం నెట్టింట విపరీతంగా వైరల్ అవుతూ ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తున్నాయి. మూడు భాషల్లో ఎంట్రీ.. 'కుమారి 21ఎఫ్'తో తిరుగులేని క్రేజ్: ముంబైకి చెందిన హెబ్బా పటేల్ డ్యాన్సర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించి, 2014లో తమిళ, కన్నడ మరియు తెలుగు చిత్ర పరిశ్రమల్లోకి ఒకే ఏడాది అడుగుపెట్టింది. తెలుగులో 'అలా ఎలా?' సినిమాతో పరిచయమైనప్పటికీ, 2015లో రాజ్ తరుణ్ సరసన నటించిన 'కుమారి 21ఎఫ్' చిత్రం ఆమె కెరీర్‌ను ఒక్కసారిగా మలుపు తిప్పింది. ఆ తర్వాత 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'ఈడోరకం ఆడోరకం', 'ఒరేయ్ బుజ్జిగా' వంటి వరుస సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువైంది. ఓటీటీలోనూ అదరగొడుతున్న 'కుమారి': కేవలం కమర్షియల్ సినిమాలే కాకుండా విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ హెబ్బా ముందుకు సాగుతోంది. నేరుగా ఓటీటీలో విడుదలైన 'ఓదెల రైల్వే స్టేషన్' మరియు రీసెంట్ మూవీ 'ఓదెల 2'తో నటిగా తనలోని మరో కోణాన్ని ఆవిష్కరించి ప్రశంసలు అందుకుంది. ఇక ప్రస్తుతం కొన్ని తమిళ చిత్రాల షూటింగ్‌లతో బిజీగా ఉంటూనే, మరోవైపు సోషల్ మీడియాలో నిరంతరం యాక్టివ్‌గా ఉంటూ తన లేటెస్ట్ ఫొటోషూట్‌లతో అభిమానులకు టచ్‌లో ఉంటోంది. చీరలో కిల్లింగ్ లుక్స్: తాజా ఫొటోషూట్‌లో హెబ్బా పటేల్ సాంప్రదాయ పట్టుతో రూపుదిద్దుకున్న పిక్‌లో గోల్డ్ అండ్ కావర్ ఆరెంజ్ టిష్యూ జరీ చీరలో రెడ్ బ్లౌజ్ ధరించి సంప్రదాయ బ్యూటీగా మెరిసిపోయింది. ఇక పట్టు చీరను, దానికి సరిపోయే లోతైన సింధూర ఎరుపు రంగు, చేతుల పట్టు బ్లౌజ్‌ను ధరించింది. వీటికి మ్యాచింగ్ స్టేట్‌మెంట్ ఇయర్ రింగ్స్, గ్రాండ్ లుక్ చోకర్ నెక్లెస్ ధరించి తన



లుక్‌ను కంప్లీట్ చేసింది. ట్రెడిషనల్ చీరకట్టులోనూ తనదైన గ్లామర్ అండ్ బ్యాక్ అందాలతో అభిమానులకు గిలిగింతలు పెడుతోంది హెబ్బా పటేల్. పాత్రలకు అనుగుణంగా ఒదిగిపోతూ, ఫ్యాషన్‌లోనూ సరికొత్త ప్రయోగాలు చేస్తున్న ఈ 'కుమారి' లుక్స్‌పై మీరూ ఒక లుక్కేసేయండి

Printed, Published and Owned by Kothinti Devender Reddy, Published at 14-20-677/482, VVN Nagar, Madhapur, Hyderabad, Telangana- 500 033. Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS, H.No.11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal-Malkajgiri District - 500098. **Editor : Kothinti Devender Reddy**. PRGI REGD NO.TGTEL/26/A1335. Mail ID: janaganamanadaily@gmail.com, Ph:040-29701155